


అనంత
# జనశక్తి
జనం కోసమే మా అక్షరం

28.08.2026
శుక్రవారం | రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 59
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## మీరాలం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- సస్పెన్షన్ బ్రిడ్జి పనులను పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి
- భారీ క్రేన్‌పై నుంచి చెరువు పరిసరాల పరిశీలన
- పనుల నాణ్యతపై అధికారులకు సీఎం ఆదేశాలు
- నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయాలని సూచన
- చెరువులోకి మురుగునీరు రాకుండా చర్యలు
- మూసీలోకి వరద నీరు సాఫీగా వెళ్లేలా నాలా విస్తరణ
- వాటర్ స్పోర్ట్స్‌కు అనువుగా ప్రత్యేక డిజైన్
- ఐలాండ్ అభివృద్ధితో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచన

హైదరాబాద్, ఆగస్ట్ 27, అనంత జనశక్తి న్యూస్
హైదరాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ఉదయం మీరాలం చెరువును ఆకస్మికంగా పరిశీలించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చెరువు పరిసరాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన స్వయంగా పరిశీలించి, పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భారీ క్రేన్‌పై నుంచి చెరువు పరిసరాలను పరిశీలించిన సీఎం.. మీరాలం చెరువుపై నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జిపనులను పరిశీలించారు. వంతెన నిర్మాణంతోపాటు చుట్టుపక్కల చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి, భవిష్యత్‌లో అందుబాటులోకి రానున్న సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
5లో..



మీరాలం చెరువులోకి మురుగునీరు చేరకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. చెరువు నుంచి మూసీ నదిలోకివరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాను విస్తరించాలని ఆదేశించారు. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు చెరువులో నీటి నిల్వ, వరద ప్రవాహం కారణంగా ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచాల్సిన అవసరాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చెరువును కేవలం నీటి వనరుగా కాకుండా నగర ప్రజలకు ఆహ్లాదకరమైన పర్యాటక, వినోద ప్రాంతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సీఎం పలు సూచనలు చేశారు. వాటర్ స్పోర్ట్స్‌కు అనువుగా ప్రత్యేక డిజైన్‌ను రూపొందించాలని, మీరాలం చెరువులోని ఐలాండ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు.

## "జో ఖేలేగా.. వో ఖిలేగా"

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- క్రీడల్లో యువత చురుగ్గా పాల్గొనాలి: ప్రధాని
- గ్రామీణ ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యం
- క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, సౌకర్యాలు
- స్పోర్ట్స్ సైన్స్‌పై ప్రత్యేక దృష్టి
- 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా భారత్: మోదీ 2లో..



న్యూఢిల్లీ, ఆగస్ట్ 27, అనంతజనశక్తి న్యూస్
జాతీయ క్రీడా దినోత్సవం (ఆగస్టు 29) సందర్భంగా దేశంలోని క్రీడాకారులు, యువతతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యక్షంగా సంభాషించారు. 'ఖేలో ఇండియా డైలాగ్ - ఖేల్ కీ బాత్, ప్రధాని మోదీతో' అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

## పాక్‌కు S400 అతిపెద్ద ముప్పు


- మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా
- S-400ల స్థానాన్ని గుర్తించేందుకు పాక్ గూఢచారులు
- ఆపరేషన్ సిందూర్‌పై కీలక విషయాలు 2లో..



న్యూఢిల్లీ, అనంత జనశక్తి న్యూస్
గతేడాది జరిగిన ''ఆపరేషన్ సిందూర్''కు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. భారత వైమానిక రక్షణ వ్యవస్థలో అత్యంత కీలకమైన S400 సిస్టమ్ మొత్తం యుద్ధంలో ప్రముఖ పాత్ర పోషించిందని, ఇవి ఎక్కడ మోహరించి ఉన్నాయనే వివరాలు కనుక్కోవడానికి పాకిస్తాన్ తన గూఢచారుల్ని, స్లీపర్ సెల్స్‌ను యాక్టివేట్ చేసిందని రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా వెల్లడించారు.

## నా బెడ్‌రూమ్‌లో గబ్బిలంలా వేలాడుతున్నారా?

- రామ్‌దేవ్ బాబాపై కంగనా ఫైర్
- యోగాగురువు నుంచి వ్యాపారవేత్తగా మారారు 2లో..



## 8 మంది ఏపీ యాత్రికుల గల్లంతు

- నేపాల్ వరదలపై మంత్రి లోకేష్ సమీక్ష
- ముగ్గురి ఆచూకీ కోసం ముమ్మర ప్రయత్నాలు!
- కొనసాగుతున్న అత్యవసర చర్యలు

చైనా సరిహద్దు ప్రాంతాల్లో మిస్సింగ్ 2లో..



అమరావతి, ఆగస్ట్ 27, అనంతజనశక్తి న్యూస్
నేపాల్‌ను హఠాత్తుగా ముంచెత్తిన ఫ్లాష్ ఫ్లడ్స్ (ఆకస్మిక వరదలు) అక్కడ పర్యటిస్తున్న భారతీయ యాత్రికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఈ ప్రాణాంతక వరదల ధాటికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కనీసం ఎనిమిది మంది యాత్రికులు దారితెలియని పరిస్థితుల్లో చిక్కుకుపోయారని.... వారి ఆచూకీ దొరకడం లేదని నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రాథమికంగా ధృవీకరించింది.

## హనుమకొండ కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

- బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత
- హరీష్ రావు అరెస్ట్
- పోలీసు స్టేషన్ ఎదుట కార్యకర్తల ధర్నా

హనుమకొండ, ఆగస్ట్ 27, అనంత జనశక్తి న్యూస్
నగరంలోని కలెక్టరేట్ వద్ద టీఎన్జీవోలు నిర్వహించిన ధర్నాలో మాజీమంత్రి హరీశ్‌రావు పాల్గొని మద్దతు తెలిపారు. దీంతో ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేసి అక్కడినుంచి తరలించారు. ఈ క్రమంలో ధర్నా శిబిరం వద్ద ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. హరీశ్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
పోలీసులు, బీఆర్ఆర్ శ్రేణులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. 2లో..



## దేశంలో క్రీడలకు మోదీ కొత్త దిశ చూపించారు

కేంద్ర మంత్రి పెమ్మసాని



2లో..

అమరావతి, ఆగస్ట్ 27, అనంతజనశక్తి న్యూస్
దేశంలో క్రీడలకు కొత్త దిశ చూపిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీదని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. 2014 తర్వాత క్రీడారంగంలో వ్యవస్థీకృత సంస్కరణలు జరిగాయని వివరించారు.

## ఓయూ స్టూడెంట్లను మోసం చేయొద్దు

- వెయ్యి కోట్లు ఎక్కడ?
- రేవంత్‌పై రాంచందర్ రావు ఆగ్రహం
- ఓయూకు ఒక్క రూపాయి ఇవ్వలేదు
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం దారిలోనే.. కాంగ్రెస్



హైదరాబాద్, ఆగస్ట్ 27, అనంత జనశక్తి న్యూస్
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)కి రూ.వెయ్యి కోట్లు ఇస్తానని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. హైదరాబాద్ తార్నాకలోని నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 5లో..

## చిలకలూరిపేటలో ఘోర ప్రమాదం

- ఏడుగురి మృతి, 8 మందికి తీవ్ర గాయాలు!
- ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొనడంతో ప్రమాదం

పల్నాడు, అనంత జనశక్తి న్యూస్
పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈరోజు తెల్లవారుజామున ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలవడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. మృతులందరూ చిలకలూరిపేట మండలం వేలూరుకు చెందిన వారిగా గుర్తించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. 2లో..



## ఏఐసీసీకి క్రమశిక్షణ కమిటీ నివేదిక

కొండా సురేఖ వ్యవహారం
పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



2లో..

హైదరాబాద్, ఆగస్ట్ 27, అనంత జనశక్తి న్యూస్
మంత్రి కొండా సురేఖ అంశం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు చేయడం.. దీనిపై సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇవ్వగా.. కుమార్తె కామెంట్స్‌కు తనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

## సెప్టెంబర్ 1న బెంగళూరులో ప్రకాశ్ రాజ్ నిరసన ర్యాలీ



2లో..

## జలప్రళయంలో చిక్కుకోలేదు క్షేమంగానే ఉన్నాం



2లో..

# ఏఐసీసీకి క్రమశిక్షణ కమిటీ నివేదిక



(మొదటి పేజీ తరువాయి)

తాజాగా, ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ ఎపిసోడ్ ఏఐసీసీ పరిధిలో ఉందన్నారు. క్రమశిక్షణ కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపించడం జరిగిందని తెలిపారు.
కాంగ్రెస్ పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవని.. కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరుపలేదని మహేశ్ స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. స్వాగతిస్తామని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినంత ప్రాధాన్యం ఏ పార్టీ ఇవ్వలేదన్నారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. తెలంగాణకు ఏ రకంగానూ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తనకు SIR నోటీసు అందిందని.. వివరాలు సమర్పిస్తానని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# సెప్టెంబర్ 1న బెంగళూరులో ప్రకాశ్ రాజ్ నిరసన ర్యాలీ

## ఓట్ల తొలగింపుపై సమరభేరి

**బెంగళూరు, ఆగస్ట్ 27, అనంత జనశక్తి న్యూస్**

కర్ణాటక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో చోటుచేసుకున్న లోపాలపై ప్రజా సంఘాలు, పౌర హక్కుల వేదికలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ అంశంపై సినీ నటుడు, దర్శకనిర్మాత ప్రకాశ్ రాజ్ మండిపడ్డారు. ఓటర్ల తొలగింపును నిరసిస్తూ సెప్టెంబర్ 1న బెంగళూరులో 'ఛలో ఎలక్షన్ కమిషన్' పేరుతో భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. బెంగళూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకాశ్ రాజ్ మాట్లాడుతూ, సీఐఆర్2026 ప్రక్రియపై స్టే విధించాలని కోరుతూ పౌర సమాజ సంఘాలు త్వరలోనే న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు స్పష్టం చేశారు.
"ఈ దేశంలో ఒక ఓటరు, సాధారణ పౌరుడు తన హక్కుల కోసం ఎన్నేళ్లపాటు కోర్టుల చుట్టూ తిరగాలి? ఓటర్లను ఎందుకు ఇన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు? కర్ణాటకలో శాసనసభ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉంది. అలాంటప్పుడు ఇంత హడావుడిగా ఓటర్ల తొలగింపు ప్రక్రియ చేపట్టాల్సిన అత్యవసరమేమొచ్చింది?" అని ప్రకాశ్ రాజ్ నిలదీశారు.
రాజ్యాంగబద్ధమైన ప్రక్రియేనా? ప్రకాశ్ రాజ్ ఘాటు వ్యాఖ్యలు



ఎన్నికల కమిషనర్ల ఎంపిక విధానంపై కూడా ప్రకాశ్ రాజ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నియామక ప్రక్రియ ప్రజాస్వామ్యబద్ధంగా లేదని ఆయన ఆరోపించారు. "కమిటీలో అధికార పక్షం నుంచి ఇద్దరు, ప్రతిపక్షం నుంచి ఒక్కరు మాత్రమే ఉంటే అక్కడ ప్రజాస్వామ్యానికి చోటెక్కడుంది? అంతేకాకుండా ఎన్నికల కమిషన్ అధికారులకు చట్టపరమైన మినహాయింపు కల్పిస్తూ పార్లమెంట్‌లో నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల అధికారులు ఎలాంటి తప్పులు చేసినా వారిపై కేసులు నమోదు చేసేందుకు వీలుండదు. ఇది అధికారులకు మితిమీరిన స్వేచ్ఛను ఇస్తూ, జవాబుదారీతనాన్ని నిర్వీర్యం చేయడమే" అని ఆయన అభిప్రాయపడ్డారు.

**1.08 కోట్ల ఓటర్లకు ముప్పు: డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆందోళన**

కర్ణాటక రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆగస్టు 24న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను విడుదల చేసిన అనంతరం సవరణ ఫలితాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో ఏకంగా 1.08 కోట్ల మందిని 'ASDDO' (అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్, అదర్స్) కేటగిరీ కింద తొలగింపు జాబితాలో చేర్చడం దిగ్భ్రాంతికరమని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, దాదాపు 43 లక్షల మంది ఓటర్లకు డేటా వ్యత్యాసాలు, 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ లింక్ లేదనే కారణంతో నోటీసులు పంపనున్నట్లు శివకుమార్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు డీకే శివకుమార్ లేఖ రాశారు. అర్హులైన నిజమైన ఓటర్లు తమ అభ్యంతరాలను, ఆధారాలను దాఖలు చేయడానికి సమయాన్ని పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.

# చిలకలూరిపేటలో ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకాశం జిల్లా కొండమంజులూరులో పుట్టినరోజు వేడుకలలో పాల్గొని తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. చిలకలూరిపేట అడ్డరోడ్డు వద్ద విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో ఆటోలో 15 మంది ఉన్నారు. గాయపడిన వారిలో నలుగురు చిన్నారులు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ బాబుతో పాటు మరో ఆరుగురు మృతి చెందారు.
ప్రమాద ఘటనా స్థలిలోనే నలుగురు మృతి చెందారు. ఇద్దరు గుంటూరు జీజీహెచ్‌లో, ఒకరు చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాణాలు కోల్పోయారు. మృతులు మణెమ్మ, సంపూర్ణమ్మ, లక్ష్మీ, గంగమ్మ, మరియమ్మ, సువార్తలుగా గుర్తించారు. ఆటోడ్రైవర్ అకస్మాత్తుగా టర్న్ తీసుకోవడం వల్లే ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు విచారణలో తేలింది. గ్రామానికి చెందిన ఆరుగురు మృతి చెందడంతో.. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# జలప్రళయంలో చిక్కుకోలేదు క్షేమంగానే ఉన్నాం

- **డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్ రెడ్డి**
- **తిరుపతికి చెందిన 28 మంది కార్‌మాండూలో క్షేమం**

**అమరావతి, ఆగస్ట్ 27, అనంతజనశక్తి న్యూస్**

నేపాల్‌లో మెరుపు వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యాత్రికుల క్షేమ సమాచారంపై మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా సమీక్షిస్తున్నారు. వరదల్లో చిక్కుకున్న ఏడుగురు ఏపీ యాత్రికుల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీరిలో నలుగురు సురక్షితంగా ఉన్నారని, మరో ముగ్గురి ఆచూకీ ఇంకా లభించలేదని ఏపీ ఢిల్లీ భవన్ అధికారులు మంత్రికి వివరించారు. ఆచూకీ లభించని ముగ్గురిలో కుప్పం ప్రాంతానికి చెందిన బాల సుబ్రహ్మణ్యం, ఈషా ఫౌండేషన్ గ్రూప్‌కు చెందిన శశికుమార్, రాజ్యలక్ష్మి ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరి ఆచూకీ కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ చర్యలు ముమ్మరం చేయాలని మంత్రి లోకేష్ అధికారులను సూచించారు.
ఈషా ఫౌండేషన్‌కు చెందిన శశికుమార్ చివరిసారిగా చైనాలోని గైరోంగ్ ఎంబసీ వద్ద కనిపించినట్లు అధికారులు వెల్లడించారు. ఆయనను గుర్తించేందుకు చైనా, నేపాల్ అధికారులతో సమన్వయం కొనసాగించాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లి వరదల్లో చిక్కుకున్న కర్నూలు జిల్లాకు చెందిన భాస్కర్ శాస్త్రి సహా మరో ముగ్గురు యాత్రికులు క్షేమంగా ఉన్నారు. సురక్షితంగా ఉన్న యాత్రికులను వీలైనంత త్వరగా అక్కడి నుంచి తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని లోకేష్ అధికారులను ఆదేశించారు. యాత్రికుల భద్రతపై భారత రాయబార కార్యాలయంతో పాటు చైనా, నేపాల్ ఎంబసీలు, గైరోంగ్ ఇమ్మిగ్రేషన్ సెంటర్, ఈషా ఫౌండేషన్ ప్రతినిధులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ తాజా సమాచారాన్ని సేకరించాలని మంత్రి సూచించారు. ఆచూకీ లభించని ముగ్గురి కోసం ప్రత్యేకంగా సమన్వయ చర్యలు కొనసాగించాలని చెప్పారు. నేపాల్‌లో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో జలప్రళయం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడి పరిస్థితులకు సంబంధించిన వీడియోలు మీడియా, సోషల్ మీడియాలో చూస్తేనే భయానకంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో నేపాల్ పర్యటనకు వెళ్లిన భారతీయులు, మరీ ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల యాత్రికుల భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. నేపాల్ టూర్‌కు వెళ్లిన తమ కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు ఎలా ఉన్నారోనని ఇక్కడ ఉన్న వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో టిబెట్ మానససరోవర్ యాత్రలో ఉన్న డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్ రెడ్డి స్పందించారు. తాము నేపాల్ జలప్రళయంలో చిక్కుకోలేదని.. ప్రస్తుతం సురక్షితంగా ఉన్నామని స్పష్టం చేశారు.
బుధవారం ఓ మీడియా సంస్థతో మాట్లాడిన సతీష్ రెడ్డి.. తాము ఉన్న ప్రాంతంలో వరదల ప్రభావం లేదని వెల్లడించారు. నేపాల్‌లో వరదలు వచ్చిన ప్రాంతాన్ని ఇప్పటికే దాటి ముందుకు వెళ్లినట్లు వెల్లడించారు. ప్రస్తుతం మానససరోవర్ యాత్రలో ఉన్నామని.. తమ బృందంలోని అందరూ క్షేమంగానే ఉన్నారని చెప్పారు. ఈనెల 30వ తేదీన హైదరాబాద్‌కు చేరుకుంటామని సతీష్ రెడ్డి వెల్లడించారు.
మరోవైపు నేపాల్ వెళ్లిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పర్యాటకుల సమాచారాన్ని తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. ఇప్పటికే కంట్రోల్ రూం ఏర్పాటు చేసి పరిస్థితిని పరిశీలిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఏపీకి చెందిన ఐదుగురి ఆచూకీ ఇంకా లభించలేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ప్రకాశం జిల్లాకు చెందిన సుహాసిని రెడ్డి, కృష్ణా జిల్లాకు చెందిన రమేశ్‌బాబు, కాకినాడ జిల్లాకు చెందిన మరో ముగ్గురి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పారు.
అయితే మానససరోవర్ యాత్రకు వెళ్లిన కర్నూలు జిల్లా ఆదోని ప్రాంతానికి చెందిన కొందరు యాత్రికులు సురక్షితంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు యాత్రికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు అధికార యంత్రాంగం సంప్రదింపులు కొనసాగిస్తోంది. తిరుపతికి చెందిన 28 మంది యాత్రికులతో కూడిన బృందం ప్రస్తుతం కాఠ్‌మాండూలో సురక్షితంగా ఉన్నట్లు ఏపీ అధికారులు గుర్తించారు. యెల్లకొండ ప్రాంతంలోని ఓ హోటల్‌లో వారు ఉన్నట్లు సమాచారం అందడంతో అధికారులు వారిని సంప్రదించారు. తామంతా క్షేమంగానే ఉన్నామని యాత్రికులు తెలిపారు.
నేపాల్‌లో ఉన్న ఏపీ యాత్రికుల వివరాలను సేకరించేందుకు రాష్ట్ర అధికారులు పర్యాటక సంస్థలు, యాత్ర నిర్వహించే ఏజెన్సీలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు కూడా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటున్నారు. యాత్రికులు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారులను సంప్రదించాలని సూచించారు.
మరోవైపు.. నేపాల్‌లో ఆకస్మిక వరదలు, భారీ వర్షాల కారణంగా పరిస్థితులు తీవ్రంగా మారాయి. ఇప్పటికే వందలాది మంది గల్లంతైనట్లు అధికారికంగా సమాచారం వెలువడటంతో అక్కడికి వెళ్లిన భారతీయ యాత్రికుల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. గల్లంతైన వారిలో వందల సంఖ్యలో భారతీయులు కూడా ఉన్నట్లు వార్తలు రావడంతో వారి ఆచూకీ కోసం భారత ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.
నేపాల్ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం భారీ వరదల కారణంగా 826 మంది ఆచూకీ గల్లంతైనట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య 175కు చేరినట్లు అధికారులు వెల్లడించారు. దాదాపు 300 మంది భారతీయులు వరదల్లో కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ అధికారికంగా ప్రకటించారు.

# హనుమకొండ కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత


(మొదటి పేజీ తరువాయి)

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత తన్నీరు హరీష్ రావు ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌కుమార్‌తో పాటు పలువురిని హనుమకొండ సుబేదారి పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులకు హరీష్ రావు మద్దతు తెలిపారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం సమీపం లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళనకు వెళుతున్నారనే సమాచారంతో లా అండ్ ఆర్డర్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ పార్టీ పోలీసులు చేరుకున్నారు.
ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన తర్వాత హరీష్ రావును అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త త వాతావరణం నెలకొంది. హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీసు స్టేషన్ కు కాలినడకన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు.

# 8 మంది ఏపీ యాత్రికుల గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)



రాయబార కార్యాలయం వెల్లడించిన జాబితా ప్రకారం.... టిబెట్ సరిహద్దుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో చోప్పరపు రమేష్ బాబు (53), అన్నందేవర వెంకట్రామ్ (52), అన్నందేవర అనఘ (49)లు ఉన్నట్లు చివరిసారిగా సమాచారం అందింది. ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి సంబంధాలు తెగిపోయాయి. మరో యాత్రికుడు బాల సుబ్రహ్మణ్యం కూడా గల్లంతయ్యాడు.... ఆయన ప్రస్తుతం ఎక్కడ ఉన్నారనేది తెలియడం లేదు.
ఇక శశికుమార్ అట్లూరి, రాజ్యలక్ష్మి నిమ్మగడ్డలు చైనాలోని 'గిరోంగ్ ఇమ్మిగ్రేషన్ ఆఫీస్' వద్ద చివరిసారిగా కనిపించినట్లు అధికారులు గుర్తించారు. మరోవైపు భాస్కర్ శాస్త్రి సహా మరో ముగ్గురు సురక్షితంగానే ఉన్నప్పటికీ, వరదల కారణంగా బయటకు రాలేక అక్కడ చిక్కుకుపోయినట్లు తెలిసింది. ఆగస్టు 26 సాయంత్రం నాటికి అపర్ణ కాకాని అనే మహిళ సురక్షితంగా ఉన్నారని.... అధికారులు ఆమె పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని రాయబార కార్యాలయం తెలిపింది.
నేపాల్‌లో సంభవించిన వినాశకరమైన వరదల వల్ల మొత్తం 288 మంది భారతీయ పౌరులతో కమ్యూనికేషన్ పూర్తిగా తెగిపోయిందని భారత విదేశాంగ శాఖ అధికారికంగా ప్రకటించింది. కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లిన దాదాపు 200 మంది భారతీయులు తమను సురక్షితంగా తరలించాలని (ఎవాక్యుయేషన్) ప్రభుత్వ సహాయాన్ని కోరారు.
విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఢిల్లీలో మీడియాకు వివరాలు వెల్లడిస్తూ.... ఈశా ఫౌండేషన్‌కు చెందిన పెద్ద సంఖ్యలో సభ్యులు కూడా హిమాలయ పర్వత ప్రాంతాల్లో ఆచూకీ లేకుండా పోయారని తెలిపారు. అదే సమయంలో తమిళనాడుకు చెందిన 21 మందిని సురక్షితంగా రక్షించినట్లు చెప్పారు. చైనా సరిహద్దు వైపున కూడా కొంతమంది భారతీయులు చిక్కుకుపోయారని ఆయన వివరించారు.
వరద ప్రభావిత ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థలు పూర్తిగా ధ్వంసమవ్వడం వల్ల బాధితులను సంప్రదించడం సవాలుగా మారిందని జైస్వాల్ తెలిపారు. విపత్తులో నలిగిపోతున్న నేపాల్‌కు భారత్ తక్షణ సహాయంగా నిత్యావసర సరుకులు, సహాయక సామగ్రితో కూడిన రెండు ప్రత్యేక విమానాలను పంపించిందని పేర్కొన్నారు.

# "జో ఖేలేగా.. వో ఖిలేగా"

(మొదటి పేజీ తరువాయి)

**ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో దేశవ్యాప్తంగా ఉన్న యువ అథ్లెట్లు, యువత, యువ నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు. సుమారు 1,500కి పైగా విద్యాసంస్థల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లక్షలాది మంది యువతీ యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని క్రీడా రంగానికి ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ, యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశంలో క్రీడా సంస్కృతిని పటిష్టం చేయాలంటే క్షేత్రస్థాయి నుంచి ప్రతిభను వెలికితీయడం అత్యంత ఆవశ్యకమని నొక్కిచెప్పిన మోదీ, "ఆడేవాడే ఆనందంగా వికసిస్తాడు" (జో ఖేలేగా, వో ఖిలేగా) అనే బలమైన సందేశాన్ని అందించారు.**
**కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులకు, క్రీడా రంగానికి చెందిన ప్రతీ ఒక్కరికీ ప్రధాని మోదీ జాతీయ క్రీడా దినోత్సవ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీలో ప్రధానంగా మౌలిక వసతుల కల్పన, వర్ధమాన క్రీడాకారుల గుర్తింపు, సరైన శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్ వినియోగం, క్రీడాకారుల భవిష్యత్తుకు భరోసా వంటి కీలకమైన అంశాలపై విస్తృతంగా చర్చించారు. 'ఖేలో ఇండియా' ఉద్యమం ద్వారా చిన్న చిన్న నగరాలు, గ్రామాలు, పట్టణాల్లో దాగి ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మౌలిక వసతులు, వనరుల కొరత ఉన్న ప్రాంతాలకు సైతం క్రీడా సౌకర్యాలను చేరువ చేసి, క్రీడాకారులకు పూర్తి స్థాయిలో మద్దతుగా నిలుస్తున్నట్లు వివరించారు.**
**అంతేకాకుండా, అంతర్జాతీయ వేదికలపై భారత జెండాను రెపరెపలాడించే దిశగా, 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా భారత్‌ను క్రీడా రరంగంలో అగ్రగామిగా నిలిపేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే ఏళ్లలో అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శన చేసేందుకు ఇప్పటి నుంచే అత్యుత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రణాళిక అని వెల్లడించారు. ఈ దిశగా క్రీడల్లో భారత్‌ను మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై యువత కూడా తమ సలహాలు, సూచనలను ప్రధానితో పంచుకున్నారు. క్రీడలతోనే శారీరక, మానసిక వికాసం సాధ్యమని పునరుద్ఘాటిస్తూ, మోదీ మరోసారి "ఆడేవాడే ఆనందంగా వికసిస్తాడు" అని గుర్తుచేస్తూ యువతలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు.**

# పాక్‌కు S400 అతిపెద్ద ముప్పు

(మొదటి పేజీ తరువాయి)



ఆపరేషన్ సిందూర్ సమయంలో వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌కు ఈయన నాయకత్వం వహించారు. ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మిశ్రా ఈ వివరాలను వెల్లడించారు. ఎస్400 కారణంగా పాకిస్తాన్ యుద్ధ విమానాలు భారత సరిహద్దుకు 200 కిలోమీటర్ల పరిధిలోకి కూడా రాలేకపోయాయని తెలిపారు.

**పాకిస్తాన్‌కు ముప్పుగా ఎస్-400 సుదర్శన చక్ర:**

రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకున్న ఎస్400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ''సుదర్శన చక్ర''గా అభివర్ణిస్తారు. ఇది ఉపరితలం నుంచి శత్రుదేశాలు ప్రయోగించే క్షిపణులు, విమానాలు, డ్రోన్లను గుర్తించి, అడ్డుకోగలదు. 2018లో భారత్, రష్యా నుంచి 5 ఎస్400 సిస్టమ్స్ కోసం ఒప్పందం చేసుకుంది. ఇందులో మూడు వ్యవస్థలు భారత్‌కు అందాయి. ఇప్పుడు నాలుగో స్క్వాడ్రన్ ఈ ఏడాది జూన్‌లో అందుతుంది.
ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎస్400లు ఎక్కడున్నాయో కనుక్కోవడానికి పాకిస్తాన్ తీవ్రంగా కష్టపడింది. గూఢచారులతో పాటు ఇతర దేశాల శాటిలైట్ సాయాన్ని కూడా తీసుకుందని మిశ్రా తెలిపారు. సిందూర్ సమయంలో పాకిస్తాన్‌కు చైనా రియల్ టైమ్ ఇంటెలిజెన్స్ అందించినట్లు వార్తలు ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ విమానాలు గగనతలంలోకి వస్తే ప్రతీసారి ఎస్400 పరిధిలో లక్ష్యంగా మారాయి. దీంతోనే వీటి స్థానాలు కనుక్కోవడానికి పాకిస్తాన్ ప్రయత్నించింది.

**సైన్యానికి పూర్తిగా స్వేచ్ఛ:**

పహల్గాం దాడి తర్వాత భారత సైన్యానికి దాడి విషయంలో ప్రభుత్వం పూర్తిగా స్వేచ్ఛనిచ్చినట్లు మిశ్రా చెప్పారు. అయితే పౌరుల ప్రాణాలకు నష్టం కలగకుండా, ఉగ్రవాదులు, వారి మద్దతుదారులనే లక్ష్యంగా చేసుకోవాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఉగ్రవాదులు, వారి హ్యాండ్లర్లను టార్గెట్ చేసుకున్నారు. మే 7న జైష్, లష్కర్‌కు చెందిన తొమ్మిది ఉగ్ర శిబిరాలపై భారత్ దాడులు చేసిన తర్వాతే పరిస్థితి ముగిసే అవకాశం ఉందని, అయితే పాకిస్థాన్ ఉద్రిక్తతలను పెంచిందని మిశ్రా తెలిపారు.
పాకిస్తాన్ ఆదంపూర్ ఎయిర్ స్టేషన్ లక్ష్యంగా 1415 డ్రోన్లు ప్రయోగించిందని వీటిన్నింటిని భారత్ నిర్వీర్యం చేసిందని ఆయన తెలిపారు. అయితే, మే 9న పాకిస్తాన్ వందలాది డ్రోన్లు, క్షిపణులతో దాడి చేసిందన్నారు. పాకిస్తాన్ పౌర ప్రాంతాలు, ప్రార్థనా స్థలాలు, గురుద్వారాలను లక్ష్యంగా చేసుకున్నట్లు మిశ్రా ఆరోపించారు. దీంతో భారత్ ప్రతిదాడికి దిగాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.

**పాకిస్తాన్ రాడార్లు ధ్వంసం:**

భారత ఎయిర్ ఫోర్స్ మొదట పాకిస్తాన్ వైమానిక సామర్థ్యాలను ధ్వంసం చేసిందని మిశ్రా చెప్పారు. పంజాబ్‌లో ఉన్న అమెరికన్ AN/TPS సిరీస్ రాడార్లతో సహా పాకిస్థాన్‌కు చెందిన రాడార్లను ధ్వంసం చేశామని, రెండు కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాలను కూడా లక్ష్యంగా చేసుకున్నామని తెలిపారు. దీంతో పాకిస్తాన్ ఒక రకంగా ''చూపు'' కోల్పోయినట్లు చెప్పారు. భూమిపై ఉన్న రాడార్లు ధ్వంసం కావడంతో పాకిస్తాన్ గగనతల నిఘా కోసం AWACS వంటి వైమానిక వ్యవస్థలపై ఆధారపడాల్సి వచ్చిందని మిశ్రా తెలిపారు. సర్గోధాలో అవాక్స్ విమానాన్ని మోహరించగా, ఎస్400 దానిని కూల్చివేసినట్లు వెల్లడించారు. ఎస్400 ఆపరేటర్ అనుమతి కోరినప్పుడు తాను ''షూట్'' ఆదేశాలు ఇచ్చానని, దీంతో 341 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదించిందని మిశ్రా చెప్పారు. ఇది సర్ఫేస్ టూ ఎయిర్ దాడుల్లో అత్యంత లాంగ్ రేంజ్ దాడుల్లో ఒకటిగా నిలించిందని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్‌లో మహిళా ఫైటర్ పైలట్లు కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. లష్కరేతోయిబా మురిడ్కే కార్యాలయంతో పాటు మే 10న పాకిస్తాన్ ఎయిర్ బేస్‌లు, కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాలపై దాడులు చేశారని చెప్పారు.

# దేశంలో క్రీడలకు మోదీ కొత్త దిశ చూపించారు

(మొదటి పేజీ తరువాయి)



ప్రతిభ గుర్తింపు, యాంటీ డోపింగ్ చట్టాలతో క్రీడలకు ఊతం లభించినట్లు అయిందన్నారు. గుంటూరులో రూ.14 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టామని చెప్పారు. క్రీడా బడ్జెట్‌లో కేటాయింపులు రూ.2 వేల నుంచి రూ.4 వేల కోట్లకుపైగా పెంచిన్లు తెలిపారు.
వచ్చే ఐదేళ్లలో రూ.25 వేల కోట్లతో క్రీడా మౌలిక సదుపాయాల లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పెమ్మసాని పేర్కొన్నారు. ఒలింపిక్ స్థాయి శిక్షణా కేంద్రాల ఏర్పాటే కేంద్ర ప్రభుత్వ విజన్‌కు నిదర్శనమని అన్నారు. 2030 కామన్వెల్త్, 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా కేంద్రం ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. యువతతో సంభాషణ ద్వారా వారి అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గత పదేళ్లలో భారత్ పతకాల పెరుగుదలకు యువతలో పెరిగిన ఆత్మవిశ్వాసమే కారణమని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు.

# నా బెడ్‌రూమ్‌లో గబ్బిలంలా వేలాడుతున్నారా?

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 29, అనంతజనశక్తి న్యూస్**

యోగాగురువు రామ్‌దేవ్ బాబా చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'ఆయన (రామ్‌దేవ్) నా బెడ్‌రూమ్‌లో గబ్బిలంలాగా వేలాడుతున్నారా' అని ప్రశ్నించారు. గతంలో నీట్ లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టిన విద్యార్థులను కంగన విమర్శించిన విషయం తెలిసిందే. నిరసనకారులను జనరేషన్ గట్టర్(అంటే మురికి తరమని అర్థం) అని దూషించారు. అయితే ఈ వ్యాఖ్యలపై వివాదం రేగడంతో ఆమె సర్వత్రా విమర్శలు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో కంగన వ్యాఖ్యలపై రామ్‌దేవ్ బాబా ఘాటుగా స్పందించారు. యువతను జనరేషన్ గట్టర్ అనడానికి ఆమె అర్హతేంటని ప్రశ్నించారు. కంగన జీవితం ఎలాంటిదో అందరికీ తెలుసని మండిపడ్డారు. అలాంటి వారి గురించి మాట్లాడడం తనకు ఇష్టం లేదన్నారు. రామ్‌దేవ్ విమర్శలకు తాజాగా కంగన కౌంటర్ ఇచ్చారు. 'నా జీవితం గురించి, నా వ్యక్తిత్వం గురించి రామ్‌దేవ్‌కు ఎలా తెలుసు? ఆయన నా బెడ్‌రూమ్‌లో గబ్బిలంలాగా వేలాడుతూ ఈ విషయాలు గమనిస్తున్నారా?' అంటూ ఆమె సెటైర్లు





వేశారు. యోగాగురువు నుంచి వ్యాపారవేత్తగా మారిన ఆయన తనకు వ్యక్తిత్వం నేర్పకూడదని ధ్వజమెత్తారు. సనాతన ధర్మంతో మొదలై పక్కా వ్యాపారిగా రామ్‌దేవ్ బాబా మారిపోయారని విమర్శించారు. ఆయుర్వేద మందులు అమ్మే స్థాయి నుంచి లోదుస్తులు అమ్మే స్థాయికి ఆయన వ్యాపారం దిగజారిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాగా గతంలో రామ్‌దేవ్‌కు సంబంధించిన పతంజలి సంస్థపై కంగన కోర్టులో కేసు కూడా వేశారు. ఆ సంస్థ ప్రకటనలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని పేర్కొన్నారు.

# "లంచం డబ్బులు మొత్తం సమానంగా పంచుకుంటాం"

**– గంగాజలం సాక్షిగా ప్రమాణం చేసిన కౌన్సిలర్లు**

ప్రజా సంక్షేమం కోసం పనిచేయాల్సిన ప్రజాప్రతినిధులు అవినీతికి పాల్పడటమే కాకుండా.. లంచాల పంపకం కోసం పవిత్రమైన గంగాజలాన్ని సాక్షిగా పెట్టుకుని ప్రమాణం చేసిన దారుణ ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని షాజహాన్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చోటుచేసుకున్న ఈ వింత ప్రతిజ్ఞకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో తీవ్ర దుమారం రేగుతోంది. స్థానికంగా ఉన్న 60 మంది ప్రజాప్రతినిధుల.. లంచం డబ్బులను తాము సమానంగా పంచుకుంటామని.. గంగాజలం సాక్షిగా ప్రమాణం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. ప్రజలంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పదవీ ప్రమాణ స్వీకారాన్ని తలపించిన లంచాల ఒప్పందం**



సాధారణంగా ప్రభుత్వం నిర్దేశించిన పద్ధతిలో రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని చేసే పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం తరహాలోనే ఈ 'లంచం ప్రతిజ్ఞ' వేడుక జరగడం గమనార్హం. ఒక వ్యక్తి పాత్రలో పవిత్ర గంగాజలాన్ని పట్టుకుని నిలబడగా.. మిగతా కౌన్సిలర్లు అందరూ తమ చేతుల్లో నీటిని ఉంచుకుని ఆయన చదివిన ప్రమాణ వచనాలను తూచా తప్పకుండా వల్లెవేశారు. ఈ వింత ప్రమాణంలో పాల్గొన్న సభ్యులు మాట్లాడిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీకి సంబంధించి ఏదైనా లంచం రూపంలో సొమ్ము వస్తే.. ఆ డబ్బును కార్పొరేషన్‌లోని 60 మంది కౌన్సిలర్ల మధ్య ఏమాత్రం తేడా లేకుండా సమానంగా పంచుకుంటామని ఒకరికొకరు మాట ఇచ్చుకున్నారు. అంతేకాకుండా రాబోయే రోజుల్లో ఏ ఒక్క సభ్యునికైనా ఏదైనా సమస్య లేదా ఇబ్బంది ఎదురైతే.. మిగిలిన వారందరూ అతనికి అండగా నిలబడి పూర్తి మద్దతు ఇస్తామని ప్రతిజ్ఞ చేశారు.

**లంచం పంపకాల ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే..!**

ఈ అక్రమ ప్రమాణంలో మరొక తీవ్రమైన అభ్యంతరకరమైన అంశాన్ని కూడా పొందుపరిచారు. ఈ లంచాల పంపకాల ఒప్పందాన్ని ఉల్లంఘించిన వారిని, సమాచారాన్ని బయటకు చేరవేసిన వారిని 'ద్రోహి'గా పరిగణిస్తామని బెదిరించే ధోరణిలో ప్రస్తావించడం కౌన్సిలర్ల తెగింపునకు అద్దం పడుతోంది. ప్రజాధనాన్ని లంచాల రూపంలో దోచుకోవడానికి, దానిని పంచుకోవడానికి మున్సిపల్ సభ్యులు ఈ స్థాయిలో దిగజారడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

**విచారణకు ఆదేశించిన మున్సిపల్ కమిషనర్..**

ఈ సంచలన వీడియో బయటకు రావడంతో మున్సిపల్ కమిషనర్ సౌమ్యా గురురాణి స్పందించారు. ఈ వీడియో గత ఏడాది నవంబర్ నెలకు సంబంధించినదని, ఆ సమయంలో తాను ఈ మున్సిపల్ కమిషనర్ పదవిలో లేనని ఆమె స్పష్టం చేశారు. అయినప్పటికీ.. దీని తీవ్రతను బట్టి సమగ్ర విచారణకు తక్షణమే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. విచారణ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ అక్రమ ప్రమాణ స్వీకారంలో పాల్గొని దోషులుగా తేలిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.

## 11 వేల కి.మీ. రైలు మార్గాలు ఇక నాలుగు వరసలు: వైష్ణవ్



దిల్లీ: దేశంలో అత్యంత రద్దీగా ఉండే ఏడు మార్గాలను నాలుగు వరసలుగా విస్తరిస్తున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రయాణికుల చేరవేత, సరకు రవాణా సామర్థ్యాన్ని పెంచడానికి మొత్తంగా 11వేల కి.మీ. మార్గాలను ఇలా తీర్చిదిద్దుతున్నామని, రైల్వే వ్యవస్థలో ఇది 16 శాతమే అయినా ట్రాఫిక్‌లో వీటిద్వారా వెళ్లేదే 41 శాతమని ఆయన 'ఎక్స్'లో తెలిపారు. దిల్లీ హౌవ్‌డా, ముంబయి దిల్లీ, హౌవ్‌డా చెన్నై, చెన్నైముంబయి, దిల్లీచెన్నై, ముంబయిహౌవ్‌డా, దిల్లీ గువాహటి మార్గాలను నాలుగు వరసలుగా చేస్తున్నట్లు చెప్పారు. తక్కువ వ్యయంతో, కాలుష్యరహిత రవాణాకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు.

## యజమాని ఎవరో తేల్చేందుకు గేదెకు డీఎన్ఏ పరీక్ష!

బిహార్‌లో ఓ గేదె వివాదం పోలీస్‌స్టేషనుకు చేరి, ఇప్పుడు డీఎన్ఏ పరీక్ష దాకా వెళ్లింది. గయా జిల్లాకు చెందిన ఈ గేదె అసలు యజమాని ఎవరో నిర్ధారించేందుకు డీఎన్ఏ పరీక్ష చేయించాలని మగధ్ రేంజ్ ఐజీ వికాస్ వైభవ్ ఆదేశించారు. పరీక్ష పూర్తయ్యేవరకు గేదెను పోలీసుల అధీనంలోనే ఉంచాలని ఎస్పీకి సూచించారు. జిల్లాలోని అతరీ పోలీస్‌స్టేషను పరిధికి చెందిన సూరజ్ యాదవ్ గేదె కొద్దిరోజుల క్రితం కనిపించకుండా పోయింది. నౌరంగా టోలీలోని ప్రకాశ్ మాంఝీ తన ఇంట్లో గేదెను కట్టేసి ఉంచారని సూరజ్‌కు సమాచారం అందింది. దీంతో గేదె నాది అంటే.. నాదే అంటూ ఇద్దరూ పోలీసులను ఆశ్రయించారు. వివాదం నానాటికీ ముదిరి ఎంతకూ తెగకపోవడంతో డీఎన్ఏ పరీక్షకు ఐజీ ఆదేశించారు. డీఎన్ఏ సాయంతో ఆ గేదె తల్లిదండ్రుల సంబంధ ధ్రువీకరణ ద్వారా యాజమాన్యాన్ని నిర్ధారించే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.



## పాఠశాల ప్రవేశ పత్రంలో కులం వివరాల గడి వద్దు



**– అధికారులకు హిమాచల్‌ప్రదేశ్ సీఎం ఆదేశం**


శిమ్లా: పాఠశాలల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు నింపే పత్రాల్లో కులం వివరం తెలిపే గడిని తొలగించాలని హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖూ అధికారులను ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి దీనిని అమలు చేయాలన్నారు. హిమాచల్‌ప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ మండలి సమావేశానికి బుధవారం అధ్యక్షత వహించిన సందర్భంగా ఈ విషయాన్ని పేర్కొన్నారు. సమాజంలో కుల వివక్షను నిర్మూలించి, సౌభ్రాతృత్వాన్ని, సమానత్వాన్ని ప్రోత్సహించే దిశగా ఈ చర్య తొలి అడుగని ముఖ్యమంత్రి తెలిపారు. అయితే, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందే సమయంలో కులం వివరం జతచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.



## రైల్వేట్రాక్‌పై యువతి రీల్స్.. 2 చేతులు కోల్పోయి విషాదం

ఝార్ఖండ్‌లో రైల్వేట్రాకుపై రీల్స్ చేస్తున్న పూర్ణిమ కుమారి(19) అనే యువతిని వెనుక నుంచి వచ్చిన రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె రెండు చేతులు కోల్పోవడమే కాకుండా మిగతాచోట్లా తీవ్ర గాయాలయ్యాయి. గఢ్వా జిల్లాకు చెందిన ధీరజ్‌సింగ్ కుమార్తె పూర్ణిమ. మంగళవారం స్నేహితులతో కలిసి రీల్స్ చేసేందుకు గఢ్వా పోలీస్‌స్టేషను పరిధిలోని జోబరీయా గ్రామ సమీప రైల్వేట్రాకు వద్దకు వెళ్లింది. ట్రాకుపై వీడియో చిత్రీకరిస్తూ వెనుక వైపు రైలు వస్తున్న విషయాన్ని ఆమె గమనించలేదు. దీంతో ట్రాకుపై ఉన్న పూర్ణిమను రాంచీ చోపన్ రైలు ఢీకొట్టింది. స్నేహితులు ఆమెను గఢ్వా సదర్ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. మెరుగైన వైద్యం కోసం పూర్ణిమను మరో పెద్ద ఆసుపత్రికి తరలించేందుకు సిఫార్సు చేసినట్లు గఢ్వా సివిల్ సర్జన్ జాన్ ఎఫ్.కెన్నెడీ తెలిపారు.

## అధికారంలోకి వస్తే.. ఏటా ప్రతి మహిళకు రూ.40 వేలు ఇస్తాం: సమాజ్‌వాదీ పార్టీ



లఖ్‌నవూ: రానున్న 2027 అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి తాము అధికారంలోకి వస్తే.. ఏడాదికి ప్రతి మహిళకు రూ.40 వేల చొప్పున ఆర్థిక సాయం అందించే స్త్రీ సమ్మాన్ సమృద్ధి యోజన అమలు చేస్తామని సమాజ్‌వాదీ పార్టీ బుధవారం ప్రకటించింది. పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మెయిన్‌పురి ఎంపీ డింపుల్ యాదవ్ మాట్లాడుతూ.. ఈ పథకం వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి మహిళకు వర్తిస్తుందని చెప్పారు. మహిళలు ఆత్మగౌర

## యూపీ వృద్ధ మహిళలకు ఉచిత బస్సు పథకం షురూ

**అరవై, అంతకు మించి వయసున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వ బస్సుల్లో జీవితకాలం ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న 24 గంటల్లోనే ఆ పథకాన్ని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ బుధవారం ప్రారంభించారు. ఇందుకు సంబంధించి లోక్‌మాతా అహిల్యాబాయ్ మాతృశక్తి యాత్ర పథకం పేరుతో లఖ్‌నవూలో ఆయన పలు ప్రత్యేక బస్సులను ప్రారంభించారు. బస్సుల్లో ఉన్న కొంతమంది మహిళలతో సంభాషించారు, సెల్ఫీ తీసుకున్నారు.**






## జెన్ ఆల్ఫా, జీ తరాలకు చేరువయ్యేందుకు ఈసీ ప్రణాళిక

2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు జెన్ ఆల్ఫా, జీ తరాలకు చేరువయ్యేందుకు ఎన్నికల సంఘం తన ప్రణాళికను పునర్వ్యవస్థీకరించింది. ప్రజల్లో ఎన్నికలపై అవగాహన పెంచే కార్యక్రమాలకు యువత నాయకత్వం వహించడమే లక్ష్యంగా ముందడుగు వేయనుంది. దేశంలోని 4,123 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 912వ తరగతులు చదువుతున్న విద్యార్థులు, కళాశాలలు, వర్సిటీలకు చెందిన యువతను ఈసీ లక్ష్యంగా చేసుకోనుంది. ఈసీ తెలిపిన వివరాల ప్రకారం.. దేశంలో 1826 ఏళ్ల వయసు గల వారు 14.78 కోట్ల మంది ఉన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 10 చొప్పున 50,000 ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ (ఈఎల్‌సీ)లు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం 15 లక్షల పాఠశాలల్లో 912 తరగతుల విద్యార్థులను సంప్రదించనుంది. 70,000 కళాశాలలు, 1,400 విశ్వవిద్యాలయాలను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయనుంది.

## ఈ బస్సంటే.. మంటకే కడుపుమంట!

**ఈ బస్సులో మంటలు చెలరేగినా విస్తరించవు. ఫ్లోరింగ్, ఇంటీరియర్ మెటీరియల్, కర్టెన్లు, వైరింగ్.. ఏవీ అగ్నిప్రమాదం బారిన పడవు. స్లీపర్ బస్సుల్లో అమర్చే పార్టిషన్ డోర్లు వీటిలో ఉండవు. అన్నిరకాలుగా ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేశారు గనకే.. ఈ 15 మీటర్ల పొడవైన మల్టీయాక్సిల్ స్లీపర్ బస్సుకు ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆటోమోటివ్ టెక్నాలజీ (ఐసీఏటీ-ఐక్యాట్) దేశంలోనే తొలి ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసింది. భారతీయ ఆటోమోటివ్ ఇండస్ట్రీ స్టాండర్డ్స్ (ఏఐఎస్)-119, 153 కింద జారీ చేసిన మొట్టమొదటి ధ్రువపత్రం ఇదేనని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ తెలిపింది. స్లీపర్ వేరియెంట్ బస్సులో 42 బెర్త్‌లు, హైబ్రిడ్ మోడల్‌లో 21 బెర్త్‌లు, 42 సీట్లు ఉంటాయి. రాజస్థాన్‌లోని సైనాటీ బస్‌బాడీ బిల్డింగ్ సంస్థ దీన్ని రూపొందించింది.**




## వృద్ధుడిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు.. అది పక్షవాతమని తేల్చిన వైద్యులు



పశ్చిమ ముంబయిలోని అంధేరీలో ఒంటరిగా నివాసం ఉంటున్న శరద్ కదమ్ (70) మంగళవారం కారు నడుపుతూ మరో రెండు వాహనాలను ఢీకొన్నారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. సరిగ్గా మాట్లాడలేకపోయిన శరద్ పలుమార్లు ప్రయత్నించినా బ్రీత్ ఎనలైజరు పరికరంలోకి గాలిని ఊదడంలోనూ విఫలమయ్యారు. ఇది మద్యం ప్రభావమే అని నిర్ధారించుకున్న పోలీసులు ఆయనపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదుచేసి, పోలీస్‌స్టేషనుకు తరలించారు. శరద్ భార్యాపిల్లలు విదేశాల్లో ఉంటున్నారు. విషయం తెలిసి బంధువు ఒకరు పోలీస్‌స్టేషనుకు వచ్చారు. అప్పటికే కొన్ని గంటలు గడిచిపోయాయి. శరద్ అస్వస్థతతో ఉన్న విషయాన్ని ఆయన గమనించి పోలీసులను అప్రమత్తం చేయడంతో కూపర్ ఆసుపత్రికి తరలించారు. సీటీ స్కానింగు చేసిన వైద్యులు అది మద్యం మత్తు కాదని, ఆయనకు స్వల్ప పక్షవాతం సోకినట్లుగా తేల్చారు. దీంతో ప్రత్యేక చికిత్స కోసం శరద్ నానావతి ఆసుపత్రిలో చేరారు. అస్వస్థతకు గురైన వృద్ధుణ్ని మద్యం తాగారని ఠాణాలో కూర్చోబెట్టి వైద్యం అందడంలో జాప్యం చేశారంటూ శరద్ బంధువు పోలీసుల తీరుపై మండిపడ్డారు.

## చక్కెర ధర ఎక్కువే ఉండాలి.. వయసు 40 దాటితే తినొద్దు



**మార్కెట్లో చక్కెర ధరల పెరుగుదలపై ప్రజల్లో ఉన్న ఆందోళనను కొట్టిపారేస్తూ మధ్యప్రదేశ్ భాజపా సీనియర్ నాయకుడు, రాష్ట్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కైలాశ్ విజయ్ వర్గీయ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. చక్కెర ధర అధికంగానే ఉండాలని, 40 ఏళ్ల వయసు పైబడ్డవాళ్లు దానిని తినడం మానుకోవాలని సలహా ఇచ్చారు. పండుగల ముందు చక్కెర ధర పెరగడంపై విపక్షాలు ఆందోళన వ్యక్తం చేయడంపై బుధవారం మీడియా ఆయనను ప్రశ్నించగా, పై వ్యాఖ్యలు చేశారు. తాను మిఠాయిలు తినడం పూర్తిగా మానేశానని మంత్రి చెప్పారు. ద్రవ్యోల్బణం తగ్గిస్తామన్న హామీతో అధికారంలోకి వచ్చిన భాజపా పేదలను, మధ్యతరగతి ప్రజలను అసంబద్ధమైన ఇటువంటి వ్యాఖ్యలతో ఎగతాళి చేస్తోందని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీతు పట్వారీ విమర్శించారు.**



# హరిత కొలువులు వస్తున్నాయ్!

పరిశ్రమల నుంచి వెలువడే పొగ, కొండల్లా పేరుకుంటున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, భానుడి భగభగలు, అకాల వర్షా లు... భూగోళం ఎంతటి ప్రమాదకర స్థితిలోకి జారిపోయిందో తెలియజేస్తున్నాయి. మరోవైపు, ప్రపంచమంతటా నిరుద్యోగ సమస్య వేధిస్తోంది. ఆర్థికమాంద్యం తరహా భయాలూ వెంటాడుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో భూతాపాన్ని తగ్గించే సరికొత్త ఆర్థిక వ్యవస్థగా 'గ్రీన్ ఎకానమీ' ప్రాచుర్యం పొందుతోంది.

పర్యావరణాన్నీ ప్రకృతి వనరులనూ నాశనం చేయకుండా, కాలుష్యాన్ని సాధ్యమైనంతగా తగ్గించే ఆర్థిక కార్యకలాపాల సమాహారమే గ్రీన్ ఎకానమీ (హరిత ఆర్థిక వ్యవస్థ). బొగ్గు, పెట్రోల్ వంటి శిలాజ ఇంధనాలకు స్వస్తిపలికి సౌర, పవన విద్యుత్తు వైపు మళ్లడం, విద్యుత్ వాహనాలను(ఈవీ) వాడటం, ఇళ్ల నుంచి వచ్చే చెత్త, ఈ-వ్యర్థాలను సద్వినియోగం చేసుకోవడం, సేంద్రియ సాగు పద్ధతులను పాటించడం వంటివన్నీ హరిత ఆర్థికంలోకే వస్తాయి. ఈ రంగంలో మేనేజర్, ఇంజినీర్ మొదలు చివరిస్థాయి టెక్నీషియన్ వరకు ఉద్యోగాలన్నీ హరిత ఉద్యోగాలే (గ్రీన్ జాబ్స్).

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్వో), అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధన సంస్థలు సంయుక్తంగా విడుదలచేసిన 'రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ జాబ్స్ యాన్యువల్ రివ్యూ' నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ రంగంలో 1.66 కోట్ల మంది పనిచేస్తున్నారు. 2030 నాటికి మరో 3.4 కోట్ల ఉద్యోగాలు రాబోతున్నాయి. ప్రపంచంలోనే అత్యధికంగా చైనా 73లక్షల గ్రీన్ జాబ్స్‌తో మొదటిస్థానంలో ఉంటే... ఐరోపా, అమెరికాలు ఆ తరవాతి స్థానాల్లో నిలుస్తున్నాయి. భారత్‌లోనూ రాబోయే రోజుల్లో హరిత ఉద్యోగాలు భారీగా అందివస్తాయని అంచనా. పీఎం సూర్యఘర్ వంటి కేంద్ర పథకాలతో వచ్చే అయిదేళ్లలో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయి. కానీ, యువత వాటిని అందిపుచ్చుకోవడంలో వెనకబడుతోందనే వాదన ఉంది.

**పెద్దసంఖ్యలో అవకాశాలు**

లింక్డ్ఇన్ గ్లోబల్ గ్రీన్ స్కిల్ రిపోర్టు- ప్రపంచవ్యాప్తంగా హరిత ఉద్యోగాల డిమాండ్ ఏటా 7.7శాతం మేర పెరుగుతుంటే, అందుకు అవసరమైన నైపుణ్యాలు కలిగినవారు మాత్రం 4.3 శాతమే ఉన్నట్లు విశ్లేషించింది. సంప్రదాయ డిగ్రీలు గ్రీన్ మార్కెట్ అవసరాలను తీర్చలేకపోతున్నాయి. యువత పాతకాలపు కోర్సులకే పరిమితం కాకుండా ఎనర్జీ మేనేజ్‌మెంట్, వ్యర్థాల నిర్వహణ, సస్టయినబుల్ ప్రొక్యూర్‌మెంట్, ఏఐ ఆధారిత పర్యావరణ పరిరక్షణ నైపుణ్యాలపై పట్టు సాధించడం ముఖ్యం. వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఇటీవల దావోస్‌లో నిర్వహించిన సదస్సులో దీనిపై సుదీర్ఘంగా చర్చించారు. బొగ్గు గనులు, డీజిల్ వంటి సంప్రదాయ పరిశ్రమలను మూసివేసేటప్పుడు, అక్కడ ఉద్యోగాలు కోల్పోయేవారికి సోలార్, రీసైక్లింగ్ రంగాల్లో పునరావాసం కల్పించాలనీ, ఆ మేరకు వారికి కొత్త నైపుణ్యాలు నేర్పించాలనీ తీర్మానించారు. రాబోయే రోజుల్లో గ్రీన్ సర్టిఫికేషన్ ఉన్న సంస్థలకే పెట్టుబడులు సమకూరుతాయంటున్న మెకిన్సే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనం- పరిశ్రమలో వస్తున్న మార్పులకు అద్దంపడుతోంది.

గ్రీన్ ఎకానమీతో సంప్రదాయ ఉద్యోగాలు తగ్గినా, వాటి స్థానంలో నాలుగు రెట్లు ఎక్కువగా హరిత ఉద్యోగాలు అందివస్తాయన్నది ఐఎల్వో అంచనా. తయారీ రంగాన్ని హరితమయం చేసేందుకు అమెరికా పర్యావరణం, గ్రీన్ ఎనర్జీ కోసం 369 బిలియన్ డాలర్ల భారీ ప్యాకేజీతో చట్టం తీసుకొచ్చింది. ఐరోపా దేశాలు 2050 నాటికి ప్రపంచంలోనే మొట్టమొదటి కాలుష్యరహిత ఖండంగా అవతరించాలని లక్షిస్తున్నాయి. ఇందుకోసం 'గ్రీన్ స్కిల్ అకాడమీ'లను స్థాపించి, కాలేజీ విద్యార్థులకు ఉచితంగా హరిత నైపుణ్యాలను మప్పుతుండటం విశేషం.


**నైపుణ్యాలను నేర్పే కోర్సులు కావాలి**

భారత్ రూ.19,774 కోట్ల పెట్టుబడితో హరిత ప్రణాళికను రచించింది. దీనివల్ల కొత్తగా ఆరు లక్షల ఉద్యోగాలు వస్తాయని అంచనా. తెలంగాణలో సౌర విద్యుత్, ఈవీల తయారీ, ఈ-వేస్ట్ రీసైక్లింగ్, గ్రీన్ బిల్డింగ్ నిర్మాణ రంగాల్లో పెట్టుబడులు ప్రవహిస్తున్నాయి. హైదరాబాద్‌ను క్లీన్‌టెక్ స్టార్టప్‌లకు కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఏపీలో గ్రీన్ హైడ్రోజన్, పవన విద్యుత్తు, పంప్డ్ స్టోరేజ్, పోర్టు ఆధారిత శుద్ధ ఇంధన ప్రాజెక్టులకు ప్రాధాన్యం పెరుగుతోంది. కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని హరిత ఉద్యోగ నైపుణ్యాల మండలి దేశవ్యాప్తంగా సౌర సాంకేతిక నిపుణులు, ఈ-వ్యర్థాల నిర్వహణ కోర్సుల్లో శిక్షణ ఇస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రైవేటు భాగస్వామ్యంతో పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల్లో గ్రీన్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తోంది. అయితే, చాలామంది వీటిపై అవగాహన లేక ఇప్పటికీ సంప్రదాయ కోర్సులనే ఎంచుకుంటున్నారు. ఆపై ఉద్యోగాలు పొందలేక నిరాశకు గురవుతున్నారు. కాబట్టి, హరిత ఉద్యోగాలపై యువతకు పెద్దయెత్తున అవగాహన కల్పించాల్సి ఉంది. కళాశాలల్లో హరిత కోర్సులను ప్రవేశపెట్టడంతో పాటు వాటిలో చేరేలా యువతను ప్రోత్సహించాలి. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను వారిలో పెంపొందించాలి. అప్పుడే ఉద్యోగాల కల్పనతో పాటు హరిత లక్ష్యాలనూ అందుకోగలం.



# కులగణన తేల్చేదేమిటి?

**జన గణనలో కుల గణన కూడా చేర్చాలన్న డిమాండ్‌ను నిరుడు ఏప్రిల్‌లో కేంద్రం అంగీకరించగా, అందుకు అనుసరించబోయే విధానంపై ఎట్టకేలకు స్పష్టత వచ్చింది. పౌరులనుంచి రాబట్టే సమాచారానికి సంబంధించిన 40 ప్రశ్నల్లో కులం కూడా ఒకటిగా ఉండబోతోందని కేంద్రం నోటిఫికేషన్ వెల్లడించింది. అయితే దీనివల్ల ఏ మేరకు ప్రయోజనం ఉంటుందన్న సందేహం తలెత్తుతుంది. వివిధ కులాల పేర్లు ఇచ్చి దాన్లో దేనికి చెందుతారో తెలపాలని పౌరుల్ని అడిగితే నిర్దిష్టమైన డేటా వెల్లడవుతుంది. అందుకు బదులుగా వారు చెప్పిన కుల వివరాలు నమోదు చేయటం వల్ల ప్రయోజనం ఉంటుందా? 2011లో యూపీఏ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, కుల గణన అంటూ దేశవ్యాప్తంగా ఒక సర్వే చేసింది. ఎన్నడో 1931లో వలస పాలకుల హయాం తర్వాత దేశంలో కులాలను గణించటం అదే మొదటిసారని అందరూ సంతోషించారు. కానీ ఆ గణనవల్ల ఏ ప్రయోజనమూ కలగలేదు. పౌరులు చెప్పిన వివరాల తర్వాత కులాలు, ఉపకులాలు, అక్షరక్రమంలో తేడాలు తదితరాల ఆధారంగా దాదాపు 46 లక్షల 73 వేల రకాలు నమోదయ్యాయి. కులాలవారీగా వాటిని వర్గీకరించటానికి 2015లో అప్పటి నీతి ఆయోగ్ చైర్మన్ అరవింద్ పనగారియా నేతృత్వంలో కమిటీ ఏర్పాటైంది. తీరా కులాల పేర్లలో ఉన్న అనేక వ్యత్యాసాల కారణంగా అయోమయం ఏర్పడి, ఆ డేటాను అధికారికంగా విడుదల చేయలేదు.**





ఇప్పుడు కూడా అదే పరిస్థితి తలెత్తగలదన్న సందేహం చాలామందిలో ఉంది. ఏ కులానికి చెందుతారన్నది తెలియజేసేలా జాబితా రూపొందించి ప్రశ్నించటంవల్ల సమాధానం సులభమవుతుంది. అర్థవంతమైన డేటా లభిస్తుంది. ఒక రాష్ట్రంలో ఉన్న కులం వేరే రాష్ట్రంలో ఉండదు. అలాగే ఒకచోట బీసీగా పరిగణించే కులం మరోచోట ఎస్సీగానో, ఎస్టీగానో ఉండే అవకాశం లేకపోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో కులాల సేకరణకు అనువైన పద్ధతుల్ని ఎంచుకోవాలి. పార్లమెంటులో ఇందుకు సంబంధించి లోతైన చర్చ జరిగివున్నా, రాష్ట్రాలవారీగా సమావేశాలు నిర్వహించి, ఆ యా ప్రాంతాల్లో ఉండే కులాలు, వర్గాల గురించిన జాబితా ఖరారుచేసివున్నా జాతీయ స్థాయిలో ఏ కులాలు ఏ కేటగిరీ కిందకు వస్తాయో, తీసుకురావాలో ఒక అంచనా వచ్చేది. సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాల్లో మన దేశం కులం నిర్వహించే పాత్ర తక్కువేమీ కాదు.

అణగారిన కులాలు స్వాతంత్ర్యానంతరం విద్యావకాశాలను అందుకోవటం, ఉన్నతోద్యోగాలు సాధించటంవంటివి సాధ్యమయ్యాయి. ఆ మేరకు చైతన్యం పెరిగి జనాభా దామాషా ప్రాతిపదికన అవకాశాలు దక్కటంలేదన్న అసంతృప్తి ఎక్కువైంది. కులగణన డిమాండ్ వెనక ఈ నేపథ్యం ఉంది. దానికి తగిన డేటా లభించేలా ఈ కుల గణన ఉండొద్దా? ఇప్పుడు పౌరులు అందజేసిన వివరాల ఆధారంగా ఎన్యూమరేటర్లు వర్గీకరించుకుని అయిందనిపిస్తారు. అప్పుడది విశ్వసించదగ్గ డేటా అవుతుందా? తమకు అన్యాయం జరిగిందనీ, తమ కుల జనాభాను తగ్గించి చూపారనీ ఆరోపణలు వెల్లువెత్తే అవకాశం కూడా లేదా?

ఆ సంగతి అటుంచి ఇతర ప్రశ్నలు గమనిస్తే ఇప్పుడు సేకరిస్తున్నది జనాభా లెక్కలా, పౌర నమోదు చిట్టానా అన్న సందేహం రాకమానదు. 2011 నాటి జనగణనలో 29 ప్రశ్నలుంటే అవి ఈసారి 40కి చేరుకున్నాయి. వీటిలో తల్లిదండ్రుల పేర్లు, వివరాలతో పాటు ఆధార్, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, మొబైల్ ఫోన్ నంబర్ వగైరాలున్నాయి. ఈ వివరాల వెల్లడి వ్యక్తిగత గోప్యతకు మంచిదేనా? ఇప్పటికే వివిధ విభాగాలవద్ద ఈ వివరాలుంటాయి. మళ్లీ అవసరమా? 2020 ఏప్రిల్‌నుంచి మొదలుకావాల్సిన జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) ప్రక్రియకు కూడా ఈ మాదిరి ప్రశ్నలే ఉన్నాయి. అది జాతీయ పౌర నమోదు చిట్టా (ఎన్ఆర్‌సీ) కోసమేనని విపక్షాలు ఆరోపించాయి కూడా. అయితే కోవిడ్ అవరోధం కారణంగా అది మూలనబడటంతో వివాదం సద్దుమణిగింది. హిమపాతం అధికంగా ఉండే జమ్మూ కశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో జనగణనలో కీలకమైన ఈ రెండో దశ సోమవారం లాంఛనంగా మొదలైంది. అందుకే కేంద్రం పారదర్శకంగా వ్యవహరించి అన్ని అంశాలూ తేటతెల్లం చేయాలి. ఈ రాష్ట్రాల్లో ఎదురయ్యే సమస్యల ఆధారంగా తగిన సవరణలు తెస్తే వేరే రాష్ట్రాల్లో ఫిబ్రవరిలో మొదలయ్యే జనగణన నాటికి ఒక సమగ్రత ఏర్పడుతుంది.

# మార్పుల ముంగిట్లో బీజేపీ!

**జూలైలో అపూర్వ ప్రకంపనలు సృష్టించిన విద్యార్థుల నిరసనలు, ఆ తర్వాత నినాదాల హోరులో కొట్టుకుపోయిన పార్లమెంటు వర్షా కాల సమావేశాలు, బంకీపూర్ సహా మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక ఫలితాల తీరుతెన్నుల తర్వాత భారతీయ జనతా పార్టీ, కేంద్ర ప్రభుత్వ వ్యవహార శైలిలో ఏమైనా మార్పు వచ్చిందా? ఇదే ఇప్పుడు దేశ రాజధానిలో ఒక ప్రధాన చర్చనీయాంశంగా ఉన్నది. ప్రస్తావిత పరిణామాల ప్రభావం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లోనూ తీవ్ర స్థాయిలో ఉన్నదని చెప్పక తప్పదు. సమాజంలో వస్తున్న మార్పులపై ఉలిక్కిపడినట్లు కనపడిన ఆర్ఎస్ఎస్ ఉన్నట్లుండి దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున యువతను, విద్యార్థులను సమీకరించే కార్యక్రమంలో పడింది. సోమవారం నుంచి విశాఖపట్టణం పొలిమేరల్లోని గుడిలోవలో మూడు రోజుల పాటు జరిగే ఆర్ఎస్ఎస్ అఖిల భారత సమన్వయ బైఠక్ సమావేశంలో బీజేపీతో సహా ఆరెస్సెస్‌కు చెందిన 32 అనుబంధ సంఘాలు హాజరవుతున్నాయి. ఈ సమావేశాల్లో కూడా 'జన్ జడ్, యువతతో సంబంధాలను ఎలా మెరుగుపరుచుకోవాలి?' అన్నదే ప్రధాన అజెండా. 2027 మార్చి నాటికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో భారీ అంతర్గత మార్పుల క్రమం పూర్తయి కొత్త నాయకత్వంతో ప్రజల ముందుకు సరికొత్తగా వచ్చే తరుణంలో గుడిలోవ సమావేశాలు జరుగుతున్నాయి. ఇవి 'సంఘ్' పరిణామ క్రమంలో కీలక భూమిక నిర్వహించనున్నాయి. 'సంఘ్'తో పాటు భారతీయ జనతా పార్టీలో పరివర్తనానికి కూడా ఈ సమావేశాలు దోహదం చేసే అవకాశాలు లేకపోలేదు.**



పన్నెండేళ్ల క్రితం భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన అనంతరం చోటుచేసుకున్న పరిణామాల ప్రభావం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌పై కూడా ఉన్నదనడంలో సందేహం లేదు. 32 అనుబంధ సంఘాల్లో బీజేపీ ఒకటి అని 'సంఘ్'లో కొందరు భావించవచ్చు కాని ఈ పన్నెండేళ్ల కాలంలో కేంద్రంలో మోదీ నాయకత్వంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీయే 'సంఘ్' రూపురేఖలను మార్చిందని చెప్పడానికి ఆస్కారం లేకపోలేదు. కేంద్ర ప్రభుత్వంలోని సమస్త మంత్రిత్వ శాఖల్లోనూ 'సంఘ్' బాధ్యులు చేరడం ఒక ఎత్తు అయితే ప్రభుత్వం చేసే తప్పిదాలు, దుశ్చర్యల బాధ్యత కూడా 'సంఘ్' స్వీకరించాల్సి రావడం మరో ఎత్తు. పాకిస్థాన్ వెళ్లి మహమ్మదాలీ జిన్నాకు ఘనంగా నివాళులర్పించినందుకు నాటి బీజేపీ అగ్రనేత లాల్‌కృష్ణ ఆద్వాణీని రాజీనామా చేయించిన ఘనత 'సంఘ్'కు దక్కింది. మరి అటువంటి నైతిక, సైద్ధాంతిక ఆధిపత్యాన్ని ప్రస్తుత పరిస్థితుల్లో చలాయించగల శక్తి 'సంఘ్'కు ఉన్నదా? ఇదీ ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. ప్రభుత్వ నియామకాల్లోనూ, పొత్తుల నిర్ణయంలోనూ, అభ్యర్థుల ఎంపికలోనూ కీలక భూమిక నిర్వహించిన 'సంఘ్' ఇవాళ ప్రభుత్వాన్ని ప్రశ్నించగలదా, నిలదీయగలదా అన్నదే కీలక ప్రశ్న. విద్యార్థులు, యువజనుల ఆందోళనను పాలకులు పట్టించుకోవాలని, విధాన నిర్ణయాల్లో తప్పిదాలు జరిగాయని మోదీ సర్కార్ అంగీకరించాలని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ పదే పదే చెబుతున్నది. మరి ప్రభుత్వం ఎంతవరకు ఆత్మ విమర్శ చేసుకుంటున్నది? ఇది విస్మరించలేని విషయం. ఇవాళ రాహుల్‌గాంధీ సహా ప్రతిపక్ష నేతలు కొందరు బీజేపీతో సహా ఆర్ఎస్ఎస్‌ను రాజకీయాల బరిలోకి లాగి వాటి సైద్ధాంతిక స్పష్టతను ప్రశ్నిస్తున్నారు. తద్వారా ఆరెస్సెస్, బీజేపీని వారు ప్రజా న్యాయస్థానంలో నిలబెడుతున్నారనేది స్పష్టం. ప్రతిపక్షాలే కాదు, ప్రజలు కూడా 'సంఘ్', బీజేపీ మధ్య పెద్ద తేడా చూడని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ తన భావి సైద్ధాంతిక భూమికను నిర్ణయించుకోవడంతో పాటు తన అనుబంధ విభాగమైన బీజేపీని కూడా భావి అవసరాలకు తగ్గట్లు మార్చగలదా లేదా అన్నది తేలవలసి ఉన్నది.

నిజానికి ఒక దశలో, తనకు, అర్ఎస్ఎస్ తోడ్పాటు అవసరం లేదని బీజేపీ వాదించే పరిస్థితి ఏర్పడింది. 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంలో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డా మాట్లాడుతూ 'మొదట్లో అంత సామర్థ్యం లేనప్పుడు ఆర్ఎస్ఎస్ అవసరం మాకు ఉండేది. ఇవాళ మా పార్టీ బాగా విస్తరించింది. తన కాళ్లమీద తాను నిలబడింది. ఇక బీజేపీ తనను తాను నిర్వహించుకోగలదు' అని స్పష్టం చేశారు. అమిత్ షా వ్యూహరచన పుణ్యమా అని ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా 14 కోట్ల మంది సభ్యులతో అవతరించిన బీజేపీ ఎన్నికలను అవలీలగా గెలిచేందుకు ఒక భారీ యంత్రాంగాన్నే రూపొందించుకుంది. బీజేపీకి తిరుగులేకుండా చేసేందుకు ప్రత్యర్థి పార్టీలను నయానా భయానా వశపరుచుకోవడమో, తుత్తునియలు చేయడమో చేయగలిగింది. అందువల్లే, 2024 ఎన్నికల్లో కేవలం 240 సీట్లు మాత్రమే సాధించినప్పటికీ మోదీ, షా నాయకత్వాలకు తిరుగులేకపోయింది. ఆ తర్వాత ప్రత్యర్థులను బలహీనపరిచి ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధించగలిగింది. చివరకు బెంగాల్‌ను సైతం వశపరచుకుంది. 'సంఘ్'లో కూడా అనేకమందికి మోదీ, షా నాయకత్వాన్ని అంగీకరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. అటు బహిర్గతంగా, ఇటు అంతర్గతంగా తిరుగులేని శక్తిగా ఎదిగిన తర్వాత బీజేపీ అగ్ర నాయకత్వాన్ని ప్రశ్నించగల సైద్ధాంతిక నైతికత ఏ సంస్థకు ఉంటుంది?

బహుశా కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భావం, విద్యార్థుల నిరసన ఈ పరిణామాలపై ఆత్మావలోకనం చేసుకునేందుకు అవకాశం కల్పించిందేమో?! దశాబ్ద కాలానికి పైగా మోదీ ఒక రాజకీయ భావజాలాన్ని, దానికొక పరిభాషను సృష్టించి లోకం మీదకు వదిలారు. దాన్ని స్వీకరించి ప్రత్యర్థులపై పదునైన విమర్శలు చేసేందుకు బీజేపీలో ఒక యంత్రాంగమే కొనసాగింది. బీజేపీ సైద్ధాంతిక భూమికను మోదీయే సృష్టించారా, అందుకు 'సంఘ్' ఆశీస్సులు ఉన్నాయా అన్న అనుమానాలకు తావు లేకుండా పోయింది. స్థూలంగా చెప్పాలంటే మోదీయిజమే బీజేపీ, 'సంఘ్' భావజాలాన్ని నిర్దేశించిందనడంలో సందేహం లేదు. ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, పార్టీ జాతీయ అధ్యక్షుడితో సహా అన్ని నియామకాల విషయంలో కూడా ఇదే ఇజం కొనసాగింది.

అయితే ఈ జూలైలో సంభవించిన పరిణామాల నేపథ్యంలో తాజాగా నియమించిన నితిన్ నబీన్ టీమ్‌లో 'సంఘ్' ముద్ర ప్రధానంగా కనపడుతుందని కొందరు సైద్ధాంతిక విశ్లేషకులు అంటున్నారు. దాదాపు ఆరు సంవత్సరాలుగా బీజేపీకి దూరంగా ఉన్న సిద్ధాంతకర్త రామ్ మాధవ్‌కు ఉపాధ్యక్షుడిగా స్థానం కల్పించగా, 14 మంది ఉపాధ్యక్షుల్లో 11 మంది, 18 మంది ప్రధాన కార్యదర్శుల్లో 11 మందికి బలమైన 'సంఘ్' శిక్షణా పునాది ఉన్నదని చెబుతున్నారు. అంతేకాదు, ఎలాంటి సమాచారాన్ని అయినా సత్యంగా ప్రచారం చేయగల, ప్రత్యర్థులపై శక్తి సామర్థ్యాలున్న ఐటీ సెల్ ఇన్‌ఛార్జి అమిత్ మాలవీయను 11 సంవత్సరాల తర్వాత ఆ పదవి నుంచి తొలగించడం, దుందుడుకు భాషను ప్రయోగించే తేజస్వి సూర్యలాంటి వారిని తప్పించడం కూడా విస్మరించదగ్గ పరిణామం కాదు. ఒక రకంగా పార్టీని, మోదీ ఆలోచనా విధానానికి అమిత్ షా శైలి వ్యూహరచనకు భిన్నంగా మార్చేందుకు ప్రయత్నం జరిగినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అంత మాత్రాన ఒకప్పుడు వెంకయ్య, సుష్మాస్వరాజ్, అరుణ్ జైట్లీ, అనంతకుమార్ తదితర నేతలతో నిత్యం పార్టీ కార్యకర్తలు, మీడియా ప్రతినిధులతో ఆరోగ్యకరంగా కనపడ్డ బీజేపీ కేంద్ర కార్యాలయాన్ని మళ్లీ చూడగలిగిన పరిస్థితులు వస్తాయా? కాలచక్రం వెనక్కి తిరగడం అంత సులభం కాదు.

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తాజాగా ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్రమోదీ చేసిన 13వ ప్రసంగంలో గడచిన 12 సంవత్సరాల్లో సాధించిన విజయాలు చెప్పుకోవడానికి పెద్దగా సమయం కేటాయించలేదు. యువ భారతదేశానికి శాస్త్రీయ దృక్పథం, ఆధునిక జాతి నిర్మాణ భాష గురించి పలవరించిన నెహ్రూ బాటలో ఆయన పయనించలేదు. లాల్‌బహదూర్ శాస్త్రిలా 'జై జవాన్, జై కిసాన్' అని నినదించాలను కోలేదు. అటల్ బిహారీ వాజపేయిలా 'జై విజ్ఞాన్' అని జోడించి సైన్స్‌కు ఉన్న ప్రాధాన్యాన్ని చెప్పాలనుకోలేదు. పీవీ నరసింహారావులా సంక్లిష్టమైన ఆర్థిక సంస్కరణల గురించి సరళమయిన భాషలో వివరించాలని భావించలేదు. మన్మోహన్‌సింగ్ మాదిరి జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడలేదు. వీరందరికీ భిన్నంగా నరేంద్రమోదీ భారత రాజకీయాల నిఘంటువుకు ఒక కొత్త పదాన్ని జోడించారు. అది: దిమాగీ నక్సల్ (ఆలోచనల పరంగా నక్సలైట్ ). అయితే మోదీ ఆ పదానికి నిర్వచనం ఇవ్వలేదు. ఉద్యోగాలను అందించలేని విద్యావ్యవస్థను, ప్రశ్న పత్రాల లీక్‌ను, నెరవేరని హామీలను గురించి ప్రశ్నించేవారు, జంతర్ మంతర్ వద్దనే కాకుండా రాంచీ, పాట్నా వంటి నగరాల్లో వీధుల్లోకి వచ్చి ఆందోళన చేసిన వారు ఈ కోవలోకి వస్తారా? పాత వ్యవస్థలతో ఎలా పోరాడాలో మోదీకి తెలుసు. గతంలో ప్రత్యర్థులపై ల్యాటియన్స్, ఆందోళన జీవులు, అర్బన్ నక్సల్స్ లాంటి ముద్రలు ఆయన వేయగలిగారు. అందరినీ ఒకే భావజాలానికి అంటగట్టగలిగారు. కాని అలాంటి ముద్రలతో జెన్ జడ్‌ను కొట్టిపారేయడం అంత సులభం కాదు. స్వీయ దేశంలోనే ఆలోచనాపరులైన, ప్రశ్నించే పౌరుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడం జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందా? ప్రపంచ వ్యాప్తంగా జ్ఞాన శక్తిగా గుర్తింపు పొందిన, అనేక కీలక సంస్థల్లో సీఈఓలను సృష్టించిన భారతదేశంలో ఎవరి గురించి మోదీ ఆందోళన చెందుతున్నారు? 12 ఏళ్లు నిరాఘాటంగా పాలించిన తర్వాత మోదీ ఇవాళ ఎదుర్కొంటున్న కొత్త సమస్య ఒక అంగీకరించగల భావజాలాన్ని, అందుకు తగ్గ పదజాలాన్ని సృష్టించలేకపోవడమే. అందుకు ప్రధాన కారణం భారతీయ జనతా పార్టీ కానీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కానీ ఒక బలమైన, స్పష్టమైన, శాస్త్రీయమైన, నవీన తరానికి అనువైన భావజాలాన్ని ఎప్పటికప్పుడు ఏర్పర్చుకోలేకపోవడమే. నినాదాలు, దుర్భాషల రాజకీయాలకు అవకాశం కల్పించడమే. తన పేరును నినదిస్తే మురిసిపోయే వ్యక్తులు కాదు, కాలానికి అనుగుణమైన సిద్ధాంతమే ఇవాళ దేశానికి తక్షణ అవసరం.

# ట్రంప్ మ్యాప్‌ల సంబరం!

**హోర్ముజ్ జలసంధిని 'చాలా త్వరలోనే' అమెరికా భూభాగంగా మారుస్తానని గతవారం ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పుడు ఇరాన్‌పై మళ్లీ భీకర దాడులకు తెగబడొచ్చని కొందరు అనుమానించారు. తీరా మంగళవారం ఆయన చేసిందల్లా 'అమెరికా కొత్త భూభాగం' అని రాసివున్న హోర్ముజ్ జలసంధి మ్యాప్‌ను విడుదల చేయటమే. దీంతో ఇరాన్ దౌత్యవేత్తలు ప్రతిదాడికి దిగారు. కాలిఫోర్నియాను ఇరాన్ భూభాగంగా చూపుతూ ఇరాన్ కాన్సులేట్ ఒక చిత్రపటాన్ని విడుదల చేసింది. వేరే దేశాల భూభాగాలు డిమాండ్ చేయటం, వాటిని అమెరికా భౌగోళిక చిత్రపటాల్లో భాగంగా చూపటం ట్రంప్‌కు కొత్తేం కాదు. రెండోసారి అధికారంలోకొచ్చిన వెంటనే గ్రీన్‌లాండ్‌పై ఆయన కన్నుపడింది. అలాగే కెనడాను అమెరికాలో విలీనం చేసుకుని 51వ రాష్ట్రంగా మారుస్తామనీ, పనామా కాల్వ ఇకపై తమదేననీ, గాజాను 'సొంతం' చేసుకుంటామనీ కూడా పలుమార్లు చెప్పారు.**

అందుకు సంబంధించి ఒక వీడియో రూపొందించి విడుదల చేశారు. వెనిజులా మ్యాప్‌లో అమెరికా జెండాను సూచించే రంగులు నింపారు. అలాగే ఇకపై గల్ఫ్ ఆఫ్ మెక్సికోను గల్ఫ్ ఆఫ్ అమెరికాగా వ్యవహరించాలంటూ ఉత్తర్వులు జారీచేశారు. అట్లాంటిక్ మహాసముద్రంలోని ఈ ప్రాంతం మెక్సికోకు పశ్చిమ, దక్షిణ దిశల్లో, అమెరికాకు ఉత్తరంవైపు, క్యూబాకు ఆగ్నేయంవైపు ఉంది. పేరు మార్చినా ప్రాదేశిక జల పరిధులేమీ మారడంలేదు గనుక మెక్సికో, క్యూబాలు ఈ విషయంలో మౌనంగా ఉండిపోయాయి. ఇక పర్షియన్ గల్ఫ్ పేరును గల్ఫ్ ఆఫ్ అరేబియాగా మారుస్తామని తొలి ఏలుబడిలో 2017లో ప్రకటించారు. దాంతో అప్పటి ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ జాగ్రఫీ చదువుకోమని ట్రంప్‌కు సలహా ఇచ్చారు. నిరుడు మే నెలలో సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ పర్యటనకెళ్లే ముందు పేరు మార్పు ఉంటుందని ప్రకటించారు. అటు తర్వాత ఎందుకో దాని జోలికి పోలేదు. ఈ 'భౌగోళిక చిత్రపట దురాక్రమణల్ని' చూసి జనం కాలక్షేపానికి నవ్వుకోవచ్చు. ట్రంప్ ప్రదర్శిస్తున్న అమాయకత్వమో, అజ్ఞానమో చూసి జాలిపడే వారూ ఉండొచ్చు. కానీ అగ్ర రాజ్యాల చరిత్ర తెలిసినవారు దాన్నంత తేలిగ్గా వదిలేయరు. ఒక విశాల పాలస్తీనా భూభాగంలోకి కొన్ని దశాబ్దాల్లో భారీయెత్తున యూదుల్ని తరలించి, అక్కడ నరమేధాలకు పాల్పడి ఇజ్రాయెల్‌ను సృష్టించి, అందుకు ఐక్యరాజ్యసమితి ఆమోదాన్ని 'రాబట్టిన' చరిత్ర ఆ దేశాలది. కనుక ఇప్పుడు ఉబుసుపోక మాట్లాడే మాటల్లో వేరే అర్థాలు ఉండొచ్చన్న అనుమానాలు రావటం సహజం. రాజకీయావతారం ఎత్తి దాదాపు పదిహేనేళ్లవుతున్నా పూర్వాశ్రమంలో నిర్వహించిన రియలెస్టేట్ వ్యాపార ప్రభావంనుంచి ట్రంప్ బయటపడలేకపోతున్నారన్నది వాస్తవం. రియలెస్టేట్ యజమాని మాదిరే ఆయన భూదాహంతో అల్లాడిపోతున్నారు. 'మళ్లీ అమెరికాను ఉన్నతంగా చేద్దాం' అనే నినాదం సారాంశం ఖనిజ సంపద పుష్కలంగా ఉండే ప్రాంతాలను అమెరికాలో విలీనం చేసుకోవటమేనన్న సందేశాన్ని ట్రంప్ పంపుతున్నారు. అందుకే అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భార్య ఉషా వాన్స్ గ్రీన్‌లాండ్ సందర్శనకెళ్లినప్పుడు డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌ల నుంచి తీవ్ర నిరసనలు ఎదురయ్యాయి. దాంతో చేసేదిలేక ఆమె మధ్యలోనే ఆ పర్యటనను విరమించుకుని వెనక్కిపోవాల్సి వచ్చింది. జనం భావోద్వేగాలు రెచ్చగొట్టి అధికారంలోకొచ్చినవారు వాటిపైనే మనుగడ సాగించాలనుకోవటం సహజం. అలాగైతేనే వారి వైఫల్యాలు మరుగున పడతాయి మరి. ఈ బాపతు నేతలు అందరి దృష్టి తమపైనే ఉండాలన్న తపనతో వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుంటారు. ట్రంప్ దీనికి భూదాహాన్ని కూడా చేర్చారు. ఈ భౌగోళిక చిత్రపటాల్ని చూసిన 'మాగా' జనం నిజంగానే ట్రంప్ వాటిని జయించుకొస్తారన్న భ్రమల్లో ఉంటారు. ఒకపక్క అరేబియా సముద్రంలో లంగరేసిన విమానవాహక నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌లో దుర్భర పరిస్థితులున్నాయనీ, కొందరు ఆత్మహత్యా యత్నం కూడా చేశారనీ వార్తలొస్తున్నాయి.

# సభ్యులు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి

**– జడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ**

**అనంతపురం, ఆగస్టు 27 :అనంత జనశక్తి న్యూస్**

జెడ్పి సర్వసభ్య సమావేశంలో సభ్యులు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉన్న సమావేశ మందిరంలో గురువారం జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించగా, సమావేశంలో హిందూపురం ఎంపీ బికె. పార్థసారథి, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధురారెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, శ్రీ సత్యసాయి జిల్లా డిఆర్ఓ కొండయ్య, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, జడ్పిటిసి సభ్యులు, ఎంపీపీలు, ఆయా శాఖల ఉమ్మడి జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పి చైర్ పర్సన్ మాట్లాడుతూ ఐదేళ్ల జడ్పీ పాలనా కాలం ముగింపుపై ధన్యవాదాలు తెలుపుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి, జిల్లా సమగ్రాభివృద్ధికి శ్రమించామన్నారు. ప్రజా ప్రతినిధులుగా స్వీకరించిన బాధ్యతను ఐదేళ్ల పాటు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా ప్రజల సమస్యలను నిరంతరం సభ దృష్టికి తీసుకువస్తూ, వాటి పరిష్కారం కోసం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేయడం జరిగిందన్నారు. కరోనా వంటి మహమ్మారి విపత్తులు, తుఫానులు, వరదలు వంటి అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగామన్నారు. సభలో నిరంతరం సాగునీరు, తాగునీరు, వ్యవసాయం, విద్య, వైద్యం, రహదారుల నిర్మాణం, పారిశుద్ధ్యం, పశుసంవర్ధక రంగం మరియు గ్రామీణాభివృద్ధికి సంబంధించిన కీలక సమస్యలపై విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, తాగునీటి కొరత, రైతుల సమస్యలు, ఎంపీడీవోల కొరత మరియు గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను సభ్యులందరూ సభ దృష్టికి తెచ్చి పరిష్కారానికి కృషి చేశారన్నారు. జెడ్పి పాలకమండలి ఐదేళ్ల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా, ఈ ప్రయాణంలో పూర్తి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా హిందూపురం ఎంపీ బికె.పార్థసారథి మాట్లాడుతూ ఆత్మకూరు అనంతపురం రూరల్ పరిధిలో తాగునీటి పైప్లైన్ కోసం 90 కోట్లు మంజూరయ్యాయని, ప్రభుత్వం నిధులు ఇచ్చినా పనులు ఎందుకు పూర్తి చేయలేదని, ఎల్.నినో పరిస్థితుల వలన త్రాగునీటి సమస్య జఠిలంగా ఉందని, ఆర్డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల పనులు పూర్తి చేయడం లేదని, వెంటనే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మడకశిర ప్రాంతం కరువు ప్రాంతం అని, మడకశిర, అమరాపురంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సంబంధిత ఎస్ఈలు డిఈలతో సమావేశం పెట్టుకొని సమస్య పరిష్కరించాలని కోరారు. తమ కూటమి ప్రభుత్వానికి రైతులపై అవ్యాజమైన ప్రేమ ఉందని, 3800 కోట్లు ఖర్చు చేసి హెచ్.ఎన్.ఎస్.ఎస్ కాలువను వెడల్పు చేసి నీరు తీసుకువచ్చామన్నారు. మల్యాల నుంచి కుప్పం వరకు త్రాగు, సాగునీరు అందిస్తున్నామన్నారు. ఎల్.నినో వల్ల తుంగభద్ర డ్యామ్ కు పూర్తిగా నీరు రాలేదని, ప్రభుత్వం వచ్చే నీటిని త్రాగునీటికి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. త్రాగునీటికి నిధుల కొరత రాకుండా చూసుకుంటామన్నారు. జిల్లాలో ఇరిగేషన్ లేని చోట పశుగ్రాసం కొరత వస్తుందని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి పశుగ్రాసం కొరత రాకుండా చూడాలన్నారు. అనంతపురం జిల్లా నుంచి అధికారుల టీం కర్ణాటకలోని చెల్లికెర తాలూకాలో వెళ్లి విబి జిరాంజీ పథకం కింద పనులు పరిశీలించాలని, అక్కడ ఆ పనులను రైతులతో అనుసంధానం చేస్తే ఇక్కడ కూడా అలా చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పావగడ మధుగిరి వరకు పనులు పూర్తిచేసి కళ్యాణదుర్గం నుంచి తుమకూరు వరకు తొందరలో రైలు తీసుకెళ్లేలా చూస్తామన్నారు. పెనుగొండ పరిధిలోని సాకర్లపల్లి వద్ద 29 కోట్ల రూపాయలతో రైల్వే బ్రిడ్జి మంజూరు చేశామని, పనులు మొదలయ్యాయని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి మాట్లాడుతూ ఎమ్మెల్సీగా గొప్ప అవకాశాన్ని తనకు కల్పించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉపముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ కి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానన్నారు. బడుగు బలహీన వర్గాల కుటుంబానికి చెందిన వడ్డెర ఆడబిడ్డనైన తనకు శాసన మండలికి వెళ్లేందుకు అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. తనకు సహాయ సహకారాలు అందించిన అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కి, ఎంపీ పార్థసారథికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ రెండేళ్లుగా అనంతపురం అర్బన్ కు సంబంధించి త్రాగునీటి పైప్లైన్ పనులు చాలా పెండింగ్ ఉన్నాయని, రూరల్ లో త్రాగునీటి సమస్య ఉందని, రెండేళ్ల నుంచి కాంట్రాక్టర్ సమస్య ఉందని, పనులను పూర్తి చేయాలన్నారు. రెండేళ్లుగా పనులు చేయకున్నా కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోలేదని.. ఆ కాంట్రాక్టర్లపై మీకు ఎందుకు అంత ప్రేమ అని అన్నారు. నాలుగు పంచాయతీలలో ఉన్న తాగు నీటి సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. గత రెండేళ్లుగా పనులు చేయకున్నా.. ఎందుకు కాంట్రాక్టర్లను తొలగించలేదని, ఈ విషయంపై ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. రెండేళ్లుగా ఇలాగే ఉంటే వచ్చే వేసవిలో తాగునీటి సమస్యను ఎలా ఎదుర్కోవాలన్నారు. వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఆ కాంట్రాక్టర్లను తొలగించి కొత్తవారికి పనులు అప్పజెప్పి పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సూపర్ ఎల్.నినో పరిస్థితులతో సాగునీరు ఇవ్వలేకపోతున్నామన్నారు. గతేడాది హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా




52 టీఎంసీలకు పైగా నీరు తీసుకువచ్చామని, ఈ ఏడాది వర్షాలు రావడంలేదని, అంత నీరు రావడం లేదని, త్రాగునీటి కోసం చెరువులను నింపుతామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హంద్రీనీవాకు ప్రత్యేక నిధులు కేటాయించారని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ వచ్చిన తర్వాతే విద్యా శాఖలో అనేక మార్పులు వచ్చాయని... ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ విద్యా సంస్థల్లో పిల్లలు చేరుతున్నారన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా మంత్రి నారా లోకేష్ వెంటనే స్పందిస్తున్నారన్నారు. పెండింగ్ బిల్లులకు సంబంధించి ఖచ్చితంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, త్వరితగతిన నిధులు విడుదల చేయిస్తామన్నారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు మరియు సాగునీటి నిర్వహణకు సంబంధించి యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల తక్షణ పరిష్కారం కోసం 9550480972 కంట్రోల్ రూమ్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో చిన్న చిన్న బోర్లు, పైప్‌లైన్ మరమ్మతులను పంచాయతీ నిధులతోనే తక్షణమే పూర్తిచేస్తారని, మరింత నిధులు అవసరమైతే డెప్యూటీ ఎంపిడిఓ, ఆర్డబ్ల్యుఎస్ ఏఈఈ పర్యవేక్షణలో మండల పరిషత్ నిధులను వినియోగిస్తారన్నారు. మరమ్మతుల కోసం డిఎంఎఫ్ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్) నుండి 4 కోట్లు, అత్యవసర నిధుల కింద 48 లక్షలు, మరియు జిల్లా పరిషత్ నిధుల నుండి 60 లక్షల రూపాయలను కేటాయించామన్నారు. ఫిర్యాదులు వచ్చిన 24 గంటల్లోనే సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డబ్ల్యుఎస్, సత్యసాయి తాగునీటి పథకాల సిబ్బందికి సంబంధించి గత 23 నెలల పెండింగ్ వేతనాలను ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ ఆమోదంతో పూర్తిగా క్లియర్ చేయడం జరిగిందన్నారు. ఎల్.నినో నేపథ్యంలో జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 40 నుండి 50 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. హెచ్.ఎల్.సి నుంచి నీటి కేటాయింపు గతంలో 25 టిఎంసిల వరకు ఉండగా, ఈ సంవత్సరం 'ప్రోరాటా' పద్ధతిన కేవలం 16 టిఎంసిలు మాత్రమే కేటాయించారని, దీనివల్ల PABR కి చేరుకునే నీరు 9 నుండి 10 టిఎంసిలకు మాత్రమే పరిమితమయ్యే అవకాశం ఉందన్నారు. త్రాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇస్తూ కేటాయించిన నీటిలో ఎక్కువ నీటిని అనంతపురం, సత్యసాయి జిల్లాల్లోని సుమారు 800 గ్రామాలకు తాగునీటి అవసరాల (సత్యసాయి, RWS, GBC కెనాల్ ద్వారా గుంతకల్లు మున్సిపాలిటీ) కొరకు భద్రపరచాల్సి ఉందన్నారు. HNSS నీటి కేటాయింపులకు సంబంధించి రాష్ట్ర స్థాయి నుండి 4 టిఎంసిల నీరు కేటాయించినప్పటికీ, KRMB (కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డు) మీటింగ్ లో తుది నిర్ణయం రావాల్సి ఉందని, నిర్ణయం వెలువడిన అనంతరం అదనపు నీటి లభ్యతను బట్టి సాగునీటిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. రాబోయే కాలంలో ఎల్ నినో ప్రభావం మరో 1 నుండి ఒకటిన్నర సంవత్సరాల వరకు ఉండే అవకాశం ఉందని IMD (వాతావరణ శాఖ) హెచ్చరించిందని, ఎక్కువ నీటి వినియోగం అవసరమయ్యే వరి, మిర్చి వంటి పంటలను సాగు చేయవద్దని రైతులకు సూచించారు. రైతులు ఆరుతడి (ID) పంటలు మరియు వర్షాధార పంటలను మాత్రమే సాగు చేయాలని, PMDS ద్వారా పెల్లటైజేషన్ పద్ధతులను పాటించాలని కోరారు. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కనేకల్లు బాలుర గురుకుల పాఠశాలకు సంబంధించి వారం రోజుల్లోపు తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ సమస్యలను తెలియజేశారు. నార్పల జడ్పిటిసి నాగరత్నమ్మ మాట్లాడుతూ కొత్త పెన్షన్లు ఇప్పించాలని, తల్లికి వందనం కింద రెండవ విడత అందించాలని, ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వాలని, కేజీబీవీ రెసిడెన్షియల్ స్కూల్స్ లో మరుగుదొడ్లు, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని కోరారు. బుక్కరాయసముద్రం జడ్పిటిసి మాట్లాడుతూ మండలంలోని సిద్ధరాంపురంలో తాగునీటి సమస్య ఉందని, నాలుగైదు రోజులకు ఒకసారి నీరు వస్తున్నాయని, సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతపురం రూరల్ జెడ్పిటిసి మాట్లాడుతూ పీఏబీఆర్ ఆత్మకూరు నుంచి అనంతపురం రూరల్ కు 90 కోట్లతో పైప్ లైన్ తీసుకొచ్చారని, ఇంతవరకు నీరు రావడంలేదని, పనులు పూర్తి కాలేదని, వెంటనే పూర్తి చేయాలన్నారు. వజ్రకరూరు జడ్పిటిసి మాట్లాడుతూ వజ్రకరూరులోని పలు వార్డులలో నీటి సమస్య ఎక్కువగా ఉందని, కొనకొండ్ల, గుడి సెలపల్లిలో నీటి సమస్య చాలా ఉందని, అక్కడ బోర్లు వేస్తే ఉప్పునీరు పడుతుందని, నీరు ట్యాంకర్లతో ఇంతకుముందు సరఫరా చేసామని, అందుకు బిల్లులు ఇవ్వలేదన్నారు. మడకశిర జడ్పిటిసి మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో ఐదు మండలాలలో శ్రీరామరెడ్డి పథకం కింద త్రాగునీరు రావడంలేదని, అక్కడ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఎవరు అందుబాటులో లేరన్నారు. పరిగి జెడ్పిటిసి మాట్లాడుతూ తమ మండలంలో పిఎబిఆర్ నీరు సరఫరా నిలిచిపోయిందని, అక్కడ విద్యుత్ అధికారులు పైప్లైన్ తీసేసారని, రిపేరు చేయించాలన్నారు. రొళ్ల జడ్పిటిసి మాట్లాడుతూ తమ మండలంలోని పలు పంచాయతీలలో తాగునీరు రావడంలేదని, సమస్య పరిష్కరించాలన్నారు. కదిరి జడ్పిటిసి మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో పార్నపల్లి నుంచి సత్యసాయి నీరు రావడంలేదని, గాండ్లపెంట, ఎన్పికుంటలో కరువు పరిస్థితి ఉందని, పైప్ లైన్ లలో నీరు వచ్చేలా చూడాలన్నారు. కనగానపల్లి జడ్పిటిసి మాట్లాడుతూ సత్యసాయి వాటర్ స్కీం కింద నీరు ఎప్పుడు వస్తాయో తెలియదని, మండలానికి నీరు ఇవ్వాలన్నారు. కనేకల్ జడ్పిటిసి మాట్లాడుతూ కనేకల్ చెరువుకు హెచ్.ఎల్.సి నీరు వచ్చిందని, కిందకు వదలడం లేదని, రైతులు నారు పోసుకున్నారని, అది ఎండిపోతుందని, పంటలకు నీరిచ్చేలా చూడాలన్నారు. ఎల్లనూరు జడ్పిటిసి మాట్లాడుతూ గండికోట నుంచి మండలంలో 4 చెరువులను నింపడానికి చర్యలు తీసుకోవాలన్నారు. లేపాక్షి జెడ్పిటిసి మాట్లాడుతూ ఎల్.నినో ప్రభావంతో పశుగ్రాసనం కొరత వచ్చిందని, ఉచితంగా పశుగ్రాసం, అదనంగా దాణా సబ్సిడీతో ఇవ్వాలన్నారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ మూగజీవాలు చనిపోయినప్పుడు వాటికి ఇన్సూరెన్స్ ఇవ్వడం లేదని, ఉపాధి పనులను కొండలు, గుట్టలలో చేస్తున్నారని, రైతులకు అనుసంధానం చేయాలన్నారు. కదిరి జడ్పిటిసి మాట్లాడుతూ సత్యసాయి నీటిని మెటుకుపల్లి గ్రామానికి ఆపేశారని, వెంటనే ఇవ్వాలని కోరారు. కళ్యాణదుర్గం జడ్పిటిసి మాట్లాడుతూ సెట్టూరులో గోడ కూలి ఎస్సి విద్యార్థి చనిపోయారని, మరొకరు గాయపడ్డారని, చనిపోయిన విద్యార్థికి ఐదు లక్షలు ఇచ్చారని, వారి కుటుంబానికి ఒక ఉద్యోగం, 50 లక్షలు ఇవ్వాలని కోరారు. సెట్టూరు ఎస్సీ హాస్టల్లో 16 మరుగుదొడ్లు నిర్మాణం పూర్తయి సిద్ధంగా ఉన్నాయని, వాటికి ప్రారంభించాలన్నారు. పెనుగొండ, సాకర్లపల్లి క్రాసింగ్ వద్ద రైల్వే బ్రిడ్జి వేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇలా పలువురు సభ్యులు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చి, వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో జడ్పిటిసి సభ్యులు, ఎంపీపీలు ఆయా శాఖల ఉమ్మడి జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పచ్చని ఆంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం ప్రగతి ప్రణాళిక

**50 శాతం గ్రీన్ కవర్ కార్యక్రమాలను ఒకే వేదికపైకి తెచ్చేందుకు ఏపీ గ్రీన్**
**ఉప ముఖ్యమంత్రి పర్యవేక్షణలో గ్రీన్ కవర్ కార్యక్రమాల సమన్వయం**
**రాష్ట్ర స్థాయి పాలక మండలి ఛైర్మన్ గా ఉప మఖ్యమంత్రివర్యులు**
**ఏపీ గ్రీన్ ఛైర్మన్ అధ్యక్షతన కార్యనిర్వాహక కమిటీ విధులు**
**జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన కార్యక్రమాల సమన్వయం**
**పచ్చదనం పెంపు, పర్యావరణ పునరుద్ధరణలో ప్రజా భాగస్వామ్య కార్యచరణ**
*** ఎమ్మెల్సీ నాగబాబు నాయకత్వంలో బాధ్యతాయుతమైన వ్యవస్థల నిర్మాణం**
*** మండల స్థాయి నుంచి మిషన్ మోడ్ కార్యాచరణకు ఉప ముఖ్యమంత్రివర్యుల ప్రణాళికలు**
*** ప్రకృతి ఆధారిత జీవనోపాధి, గ్రామీణ ఉపాధి అవకాశాల సృష్టి**

**అమరావతి ఆగస్టు 27, అనంత జనశక్తి న్యూస్**

ప్రకృతి ఒడిలో రాష్ట్ర ప్రగతి ప్రయాణం సాగాలి. అది పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం నుంచి రాష్ట్రాన్ని రక్షించాలి. ఉన్న అడవులను కాపాడుకుంటూ, కొత్త అడవులను సృష్టించాలి. ప్రతి గ్రామాన్ని పచ్చదనపు ఛత్రం కిందకు చేర్చాలి. చెట్లను కాపాడుకుంటూ, ఆ చెట్ల నుంచి వచ్చే ఫలసాయం ద్వారా ఉపాధి అవకాశాలను పెంపొందించుకుంటూ, గ్రామాల్లో ప్రకృతి ఆధారిత జీవనోపాధి లక్ష్యాలు సాధించాలన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఆలోచనల నుంచి ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ (APGREEN) రూపుదిద్దుకొంది. భవిష్యత్ తరాల కోసం పచ్చని, స్వచ్ఛమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించేందుకు చేపడుతున్న 50 శాతం గ్రీన్ కవర్ కార్యక్రమాలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకురావడం కోసం APGREEN ఏర్పాటుకు అడుగులుపడ్డాయి. స్వయం ప్రతిపత్తి కలిగిన ఈ సంస్థ ఎలాంటి లాభాపేక్ష లేకుండా విధులు నిర్వహిస్తూ, అటవీ, వ్యవసాయ, ఉద్యానవన, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్య, పరిశ్రమలు, జలవనరులు, పట్టణ స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సం ను వాతావరణ మార్పుల ప్రభావాల నుంచి కాపాడేందుకు ఉప ముఖ్యమంత్రివర్యులు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలను నిరంతరాయంగా అమలు పరుస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ఫార్మ్ ఫారెస్ట్రీ, అగ్రో ఫారెస్ట్రీ, అవెన్యూ ప్లాంటేషన్లు, కాలువ గట్లు, షెల్టర్ బెల్ట్‌లు, పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో మొక్కల పెంపకాన్ని APGREEN సంస్థ ద్వారా చేపడతారు. ముఖ్యంగా పచ్చదనం క్షీణించిన భూములు, మైనింగ్ ప్రభావిత ప్రాంతాలు, బంజరు భూములు, ఇతర ఎకో సెన్సిటివ్ జోన్ల పునరుద్ధరణకు ఈ కార్యచరణలో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ మొత్తం కార్యక్రమాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతోపాటు రైతులు, స్వయం సహాయక సంఘాలు, విద్యా సంస్థలను అనుసంధానిస్తూ, నాణ్యమైన మొక్కల ఉత్పత్తి, పంపిణీ కోసం రాష్ట్రవ్యాప్తంగా నర్సరీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేస్తారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలన్న భేదం లేకుండా 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, చెట్ల ఆధారిత జీవనోపాధి అవకాశాలను ప్రోత్సహించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి సృష్టించడం, వాతావరణ మార్పులకు అనుగుణమైన జాతుల ఎంపిక, పెంపకం, తద్వారా శాస్త్రీయ పద్ధతులతో పర్యావరణ పునరుద్ధరణ చేపట్టడం అనే ప్రధాన లక్ష్యాలను APGREEN అత్యంత నిబద్ధతతో ముందుకు తీసుకువెళ్తుంది. GIS, జియోట్యాగింగ్, డిజిటల్ మానిటరింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మొక్కల పెంపకం, వాటి మనుగడకు భద్రత కల్పించడం, గ్రీన్ కవర్ పెరుగుదల కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తుంది.

APGREEN కార్యక్రమాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, నాబార్డ్, సీఎస్ఆర్ నిధులు, కార్బన్ ఫైనాన్స్, కార్బన్ క్రెడిట్లు, గ్రీన్ బాండ్లు, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్, ఎకోటూరిజం వంటి వివిధ వనరుల ద్వారా నిధులను సమీకరించనున్నారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంలో APGREEN ఛైర్మన్, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ఆధ్వర్యంలో నిధుల వినియోగం, పచ్చదనం పెంపొందించే అంశంలో అత్యంత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసి, మిషన్ మోడ్‌లో కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. APGREEN సంస్థ గ్రీన్ కవర్ కార్యక్రమాల రాష్ట్ర స్థాయి సమన్వయం, పర్యవేక్షణ చేపడుతుంది. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ గ్రీన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీలు (DGDAs), మండల స్థాయిలో MGICs ద్వారా కార్యక్రమాలు అమలు చేస్తారు. ప్రతి అడుగులో ప్రజల భాగస్వామ్యంతో ముందుకు వెళ్లనున్నారు. 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాల్లో భాగంగా 2030 నాటికి 33 శాతం పచ్చదనం పెంపొందించాలని నిర్ణయించారు. అందుకోసం సమగ్ర ప్రణాళికను శ్రీ పవన్ కళ్యాణ్ రూపొందించారు. వచ్చే నాలుగేళ్లలో ఏడాదికి ఎన్ని హెక్టార్ల పరిధిలో పచ్చదనం పెంపొందించాలన్న దానిపై కార్యాచరణ సిద్ధం చేశారు. ఆరు నెలలు, మూడు నెలలు, నెలవారీ లక్ష్యాలను నిర్దేశించి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజన్‌కు అనుగుణంగా 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 50 శాతం గ్రీన్ కవర్ సాధించే లక్ష్యంతో చేపట్టిన ఈ మహా యజ్ఞంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని APGREEN పరిపాలనా కార్యకలాపాలు మొదలవుతున్న వేళ పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

* మూడంచెల వ్యవస్థతో ఏపీ గ్రీన్ కార్యకలాపాలు

**ఏపీ గ్రీన్ మూడంచెల వ్యవస్థ ద్వారా కార్యకలాపాలు కొనసాగిస్తుంది. రాష్ట్ర స్థాయి పాలక మండలికి రాష్ట్ర గౌరవ ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఛైర్మన్‌గా, ఏపీ గ్రీన్ ఛైర్‌పర్సన్ వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు. అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ, వ్యవసాయ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, విద్యాశాఖ, పరిశ్రమల శాఖ, రెవెన్యూ, జలవనరులు, రోడ్లు-భవనాల శాఖల ప్రధాన కార్యదర్శులు, పీసీసీఎఫ్ డైరెక్టర్లుగా ఉంటారు. వీరితోపాటు ఏపీ గ్రీన్ సీఈఓ, నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్, స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ కన్వీనర్, కార్పొరేట్ రంగానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యా సంస్థ ప్రతినిధి, ప్రముఖ పర్యావరణవేత్త, సామాజిక అటవీకరణ రంగంలో ఉన్న స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజానికి చెందిన ప్రతినిధులతో కలిపి మొత్తం 24 మంది పాలక మండలిలో భాగస్వాములుగా ఉంటారు. రాష్ట్ర స్థాయి పాలక మండలి ఏటా రెండుసార్లు సమావేశమై విధానాల రూపకల్పన, ఏపీ గ్రీన్ కార్యకలాపాల పర్యవేక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంది. రెండో అంచెలో ఎగ్జిక్యూటివ్ కమిటీ కేబినెట్ హోదా కలిగిన ఏపీ గ్రీన్ ఛైర్‌పర్సన్ అధ్యక్షతన విధులు నిర్వహిస్తుంది. కమిషనర్ గా సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి సమన్వయ బాధ్యతలను పర్యవేక్షిస్తారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశమవుతుంది. జిల్లా స్థాయి గ్రీన్ డెవలప్‌మెంట్ అథారిటీ జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన పని చేస్తుంది. జిల్లా స్థాయి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, వ్యవసాయం, ఉద్యానవనం, పరిశ్రమలు, ఆర్ అండ్ బీ, దేవాదాయ, జలవనరులు, విద్యాశాఖల అధికారులు సభ్యులుగా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసే బాధ్యతలు చేపడతారు.**

# మీరాలం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

(మొదటి పేజీ తరువాయి)

సందర్శకులను ఆకర్షించేలా పరిసర ప్రాంతాలను తీర్చిదిద్దడంతోపాటు ప్రజలకు మెరుగైన పబ్లిక్ స్పేస్‌లు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. మీరాలం చెరువుపై నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జి పూర్తయితే ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణ ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. వంతెనతోపాటు చెరువు పరిసరాల అభివృద్ధి పూర్తయితే నగరంలోని మరో కీలక వినోద, పర్యాటక కేంద్రంగా మీరాలం రూపుదిద్దుకునే అవకాశముందని అంటున్నారు. సీఎం ఆకస్మిక తనిఖీతో అధికారులు అప్రమత్తమయ్యారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, గడువులు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై మరింత దృష్టి సారించారు. కాగా, చెరువు అభివృద్ధితోపాటు వరద నీటి నిర్వహణ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.



# పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.17.5 కోట్లు మంజూరు – మంత్రి సవిత

**- ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలి**
**- పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధిపై మంత్రి సవిత సమీక్ష**

**పెనుకొండ ఆగస్టు 27 అనంత జనశక్తి న్యూస్**

మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీమతి సవితమ్మ తెలిపారు.. పెనుకొండ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ నాయకులు, సంబంధిత అధికారులతో అభివృద్ధి పనులపై ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రతి వార్డులో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. వార్డుల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్ల పనులను పూర్తి చేయడంతో పాటు అవసరమైన చోట మరిన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.17.5 కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేలా పనులను వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, పెనుకొండ మున్సిపాలిటీ పరిధిలో 1,790 మందికి పక్కా ఇళ్లకు మంజూరు అయ్యాయని తెలిపారు.. అలాగే 100 కోట్లతో అమృత్ 2 పథకం కింద ఇంటింటికీ RO ప్లాంట్ ద్వారా మినరల్ వాటర్ అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని, రూ.1 కోటితో పార్కుల అభివృద్ధి



చేపడుతున్నట్లు వెల్లడించారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనులను ఇప్పటికే పూర్తి చేశామని తెలిపారు. మున్సిపాలిటీ ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మంత్రి సవిత సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని నాయకులకు ఆమె ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ఇచ్చామని అని మంత్రి సవిత స్పష్టం చేశారు.

# ఓయూ స్టూడెంట్లను మోసం చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

. నిధులు ప్రకటించి ఏడాది గడిచినా.. రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు.
"టీచర్లకు జీతాలు ఇచ్చేందుకు డబ్బులు లేవని స్వయంగా సీఎం అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దారిలోనే.. కాంగ్రెస్ ప్రభుత్వం వెళ్తోంది. విద్యార్థుల విషయంలో మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదని చెప్తూనే ఉన్నాం. పాలిటెక్నిక్ కోర్సు కూడా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సు. పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్‌లోకి వెళ్లకుండా అడ్డుకోవటం సరికాదు. మీ నిర్ణయం సరైనది అయితే.. మళ్లీ కమిటీ ఎందుకు వేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ.15వేల కోట్లకు చేరాయి. యంగ్ ఇండియా స్కూల్స్ అని గొప్పగా చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవట్లేదు. పాలిటెక్నిక్ కాలేజీలను రద్దు చేసి.. భూములు స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారు. తెలంగాణలో విద్యార్థులు వారి హక్కుల కోసం పోరాడుతున్నారు. ఇది అంతం కాదు.. ఆరంభం మాత్రమే.



విద్యార్థులను రాజకీయంగా వాడుకునే కాన్సెప్ట్‌కు మేం వ్యతిరేకం. వారి ఉద్యమంలోకి మేం వెళ్లం.. నైతికంగానే మద్దతు ఇస్తాం" అని రామచందర్‌రావు తెలిపారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
శుక్రవారం | రంగారెడ్డి
28.08.2026


# 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవం



**- అపోహలు తొలగించి నేత్రదానానికి ప్రజలను ప్రోత్సహించాలి**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 27, అనంత జనశక్తి న్యూస్ :**

41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. తుకారామ్ రాథోడ్ సూచనల మేరకు కొత్తగూడెం డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ప్రతాప్, కొత్తగూడెంలోని జీజీహెచ్‌లో అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్రదాన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. ప్రతాప్ మాట్లాడుతూ, నేత్రదానం ద్వారా మరణానంతరం అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. నేత్రదానానికి సంబంధించిన అపోహలు, వాస్తవాలతో పాటు కార్నియా దానం ప్రాముఖ్యతను వివరించారు. ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, ఎక్కువ మందిని నేత్రదానానికి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పీఎంఓ డా. తిరుమలరావు, అగర్వాల్ ఐ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. "నేత్రదానం మరణానంతరం మరొకరి జీవితంలో వెలుగులు నింపే మహాదానం" అనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యక్రమంలో పిలుపునిచ్చారు.

# మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు



**- గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా: అదనపు కలెక్టర్**
**- యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు అవగాహన కల్పించాలి**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 27, అనంత జనశక్తి న్యూస్ :**

జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నివారణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగంతో వ్యక్తుల జీవితాలు దుర్భరమవుతాయని, ముఖ్యంగా యువత వీటి బారిన పడకుండా ముందస్తు అవగాహన కల్పించడం అత్యంత అవసరమని అన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువత, కార్మికులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో గంజాయి సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణాను తీవ్రంగా పరిగణించాలని అన్నారు. సంబంధిత శాఖలన్నీ ప్రణాళికాబద్ధంగా సమన్వయంతో పనిచేస్తూ నిరంతర తనిఖీలు నిర్వహించాలని సూచించారు. గత సమావేశం నుంచి ప్రస్తుత సమావేశం వరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, మాదకద్రవ్యాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఆర్టీసీ ద్వారా జరిగే అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆర్టీసీ కండక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, అనుమానాస్పద వస్తువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలనకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాత కక్షల నేపథ్యంలో యువకుడి దారుణ హత్య

**- మూకుమ్మడిగా దాడి.. తీవ్ర గాయాలతో మృతి**
**- బెదిరింపుల అనంతరం మణుగూరుకు వచ్చిన శివ**
**- ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**మణుగూరు, ఆగస్టు 27, అనంత జనశక్తి న్యూస్**



పాత గొడవల నేపథ్యంలో ఓ యువకుడిపై కొంతమంది వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేసి హత్య చేసిన ఘటన మణుగూరులో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మృతుడు సింహాద్రి శివకుమార్ (28) హైదరాబాద్‌లో ఇంటీరియర్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శివ వద్ద పనిచేసే సుందరయ్యనగర్‌కు చెందిన సతీష్‌తో గతంలో జరిగిన వివాదాన్ని మనసులో పెట్టుకున్న ఎంకే గ్యాంగ్ లీడర్ రమాకాంత్ @ రమ్మీ @ జెట్టితో పాటు అతని అనుచరులు శివను మణుగూరుకు వస్తే చంపేస్తామని ఫోన్ ద్వారా బెదిరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో శివ గురువారం ఉదయం 7 గంటలకు హైదరాబాద్ నుంచి మణుగూరుకు వచ్చాడు. అనంతరం రమాకాంత్ @జెట్టి ఫోన్ చేసి శివను నేతాజీ గ్రౌండ్‌కు రావాలని కోరినట్లు తెలిపారు. దీంతో శివ తన ఇంటి పక్కన ఉన్న ఉదయ్‌కుమార్‌తో కలిసి నేతాజీ గ్రౌండ్‌కు వెళ్లాడు. అక్కడ ముందుగానే పథకం ప్రకారం వేచి ఉన్న రమాకాంత్ @జెట్టి, భరత్, సాధిక్, వినయ్, ధినేష్, జంపయ్య, ప్రసాద్ తదితరులు శివపై మూకుమ్మడిగా దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఉదయ్‌కుమార్‌పై కూడా వారు దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో శివ తీవ్రంగా గాయపడగా, కుటుంబ సభ్యులు మధ్యాహ్నం సుమారు 12:30 గంటలకు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే శివ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హత్యకు దారితీసిన కారణాలు, ఘటనలో పాల్గొన్న వ్యక్తుల పాత్రపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# బీఆర్ఎస్ నాయకులారా.. బహిరంగ చర్చకు సిద్ధమా?

**- అభివృద్ధి, సంక్షేమం, ఆర్థిక వ్యవస్థపై ఎక్కడైనా చర్చకు సిద్ధం**
**- దళితబంధు, బీసీబంధు అమలుపైనా మాట్లాడుకుందాం**
**- రుణమాఫీపై మాట నిలబెట్టుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే**
**- పాయం వెంకటేశ్వర్లుపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలి**
**- బీఆర్ఎస్ విమర్శలకు ధీటుగా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పొంబోయిన ముత్తయ్య**

**గుండాల, ఆగస్టు 27, అనంత జనశక్తి న్యూస్:**

బీఆర్ఎస్ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాళ్లు విసురుతున్నారని, తాము కూడా అన్ని అంశాలపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పొంబోయిన ముత్తయ్య స్పష్టం చేశారు. గత ప్రభుత్వ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రైతు రుణమాఫీ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఎక్కడైనా చర్చించేందుకు సిద్ధమని ప్రకటించారు. గుండాల మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఊకె బుచ్చయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముత్తయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు పదేపదే చర్చకు రావాలని సవాళ్లు విసురుతున్న నేపథ్యంలో "అవును.. మేము చర్చకు సిద్ధమే. మీరు సిద్ధమా?" అని ప్రశ్నించారు.

**గత పాలనపై చర్చకు సిద్ధం**

దళితబంధు, బీసీబంధు పథకాల అమలు, వాటి ద్వారా జరిగిన ప్రయోజనాలు, అవకతవకల ఆరోపణలతోపాటు గత ప్రభుత్వ పాలనలో జరిగిన పరిణామాలన్నింటిపైనా చర్చిద్దామని ముత్తయ్య అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం కాకుండా బహిరంగ వేదికపై ప్రజల సమక్షంలో వాస్తవాలను వివరించాలని సవాల్ విసిరారు.

**పాయం వెంకటేశ్వర్లుపై విమర్శలకు ఖండన**

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలను ముత్తయ్య ఖండించారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో కొనసాగుతూ ప్రజాసేవకు పాయం వెంకటేశ్వర్లు అంకితమయ్యారని పేర్కొన్నారు. వ్యక్తిగత ఆరోపణలు, రాజకీయ విమర్శలతో ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. అదే సమయంలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆస్తులపై రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చను ప్రస్తావిస్తూ ముత్తయ్య పలు ప్రశ్నలు సంధించారు. రాజకీయాల్లోకి వచ్చిన కొద్ది కాలంలోనే భారీగా ఆస్తులు ఎలా సమకూరాయన్న అంశంపై బీఆర్ఎస్ నాయకులే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**ఆరు గ్యారంటీలపై ఎదురుదాడి**

కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీల అమలుపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు ముత్తయ్య తీవ్రంగా స్పందించారు. గత ప్రభుత్వం తెలంగాణను భారీ అప్పుల్లోకి నెట్టిందని ఆరోపించారు. రైతుబంధు పేరుతో అనర్హ ప్రాంతాలకు కూడా నిధులు వెచ్చించారన్న విమర్శలు ఉన్నాయని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ముత్తయ్య పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నామని తెలిపారు.




**"తాటాకు చప్పుళ్లకు భయపడం"**

కాంగ్రెస్ నాయకులను బెదిరించేలా బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు తాము భయపడబోమని ముత్తయ్య స్పష్టం చేశారు. "ఉడత ఊపులు, తాటాకు చప్పుళ్లకు భయపడే వ్యక్తులు కాంగ్రెస్ నాయకులు కాదు. ఎలాంటి అంశంపైనైనా, ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నాం. మీరు సిద్ధమైతే సమయం, వేదిక మీరే నిర్ణయించండి" అని సవాల్ విసిరారు. రాజకీయ విమర్శలను వ్యక్తిగత దూషణల స్థాయికి తీసుకెళ్లకుండా ప్రజలకు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి, రైతుల సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుపై చర్చ జరగాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వాంకుడోత్ రమేష్, ఎస్.కె. వాజిద్ పాషా, ఎస్.కె. కాసీం, ఎస్.కె. ఇస్రార్ తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబరు 1న ఐఎఫ్‌టీయూ జిల్లా సదస్సును జయప్రదం చేయండి

**-కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలి..**
**-స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలి: కొక్కు సారంగపాణి**

**గుండాల, ఆగస్టు 27, అనంత జనశక్తి న్యూస్:**

సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబరు 1న కొత్తగూడెంలో నిర్వహించనున్న ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రదర్శన, సదస్సుకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి పిలుపునిచ్చారు. గురువారం గుండాల మండలం కాచనపల్లిలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయడంతో పాటు హమాలీ, మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం పెంచి ప్రతి నెలా ఒకటో తేదీన చెల్లించాలని, ఆటో కార్మికులకు నెలకు రూ.10 వేల జీవనభృతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని సారంగపాణి పేర్కొన్నారు. సెప్టెంబరు 1న కొత్తగూడెంలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మిక వర్గాలకు విజ్ఞప్తి చేశారు. ఐఎఫ్‌టీయూ గుండాల ఏరియా కమిటీ నాయకులు అటికం శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆటో కార్మికులు యనగంటి లాజర్, యనగంటి చిరంజీవి, మల్టీపర్పస్ కార్మికులు తాళ్లపల్లి ముత్యం, ఎరుకల సురేష్, రాపోలు కృష్ణ, హమాలీ, ట్రాక్టర్ డ్రైవర్లు రఫీ, దుర్గారావు, రాందాస్, రాము, విక్రమ్, పరశురాం, సంపత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.




# మారెళ్లపాడు ఎత్తిపోతల ప్రారంభానికి మంత్రుల రాక

**- భద్రాద్రి జిల్లాకు 29న ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి**
**- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే పాయం**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 27 అనంత జనశక్తి న్యూస్**

అశ్వాపురం మండలంలోని మారెళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని ఈ నెల 29న శనివారం రాష్ట్ర మంత్రులు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి భారీ, మధ్యతరహా నీటిపారుదల శాఖ మంత్రి నలమడ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరుకానున్నారు.

సీతారామ ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మించిన మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. ముందుగా మంత్రులు చేరుకునే బీజీ కొత్తూరు ప్రాంతంలోని హెలిప్యాడ్‌ను పరిశీలించి, అక్కడ జరుగుతున్న పనులపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఎత్తిపోతల పథకం కెనాల్, గొందిగూడెం, జీ.కొత్తూరు సమీపంలోని సభా స్థలాన్ని పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రుల పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తే ఉపేక్షించేది లేదు

**- ఎస్పీ**
**- మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి: రోహిత్ రాజు**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 27, అనంత జనశక్తి న్యూస్ :**

ప్రజల ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి, అనంతరం అధిక మొత్తాలను వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేసే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హెచ్చరించారు. అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి, రుణాలు చెల్లించలేని పరిస్థితుల్లో ప్రజలను బెదిరించడం, వేధింపులకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడే వారిపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. ప్రజలు ప్రైవేట్ వ్యక్తుల వద్ద రుణాలు తీసుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని, రుణం తీసుకునే ముందు వడ్డీ, తిరిగి చెల్లింపు విధానం తదితర వివరాలను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగ యువతను ప్రలోభపెట్టి, వారి నుంచి డబ్బులు వసూలు చేసే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ముందస్తుగా డబ్బులు వసూలు చేసే వ్యక్తుల మాటలు నమ్మవద్దని, ఉద్యోగాల కోసం ఎటువంటి ముందస్తు చెల్లింపులు చేయవద్దని తెలిపారు. ఉద్యోగాలకు సంబంధించిన వివరాలను సంబంధిత సంస్థల అధికారిక మార్గాల ద్వారా నిర్ధారించుకోవాలని సూచించారు. ఉద్యోగాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాల పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, సోషల్ మీడియా ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు.

అక్రమంగా అధిక వడ్డీలు వసూలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారు, ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసే వ్యక్తుల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసు అధికారులకు తెలియజేయాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# గంజాయి మత్తులో ఘర్షణలు

- పాత కక్షలతో దాడులు గంజాయి తాగుతాం.. దాడులు చేస్తాం..
- కొట్లాటలకు బరితెగిస్తున్న యువత
- మణుగూరులో మత్తు మాఫియా నీడలు..
- యువత భవిష్యత్తుపై ఆందోళన
- బెల్ట్‌షాపులు, గంజాయి దందాపై నిఘా ఏదీ?
- అధికారుల తీరుపై విమర్శలు
- పీవీ కాలనీ నుంచి రాజపేట వరకు..
- అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా అవసరం

**మణుగూరు, ఆగస్టు 27 (అనంత జనశక్తి న్యూస్):**



మణుగూరు పట్టణంలో గంజాయి, మద్యం మత్తు ప్రభావంతో యువతలో పెరుగుతున్న ఘర్షణలు ఆందోళన కలిగిస్తున్నాయి. చిన్నచిన్న వివాదాలు సైతం పాత కక్షలుగా మారి దాడులకు దారితీస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కొందరు యువకులు గంజాయి మత్తులో విచక్షణ కోల్పోయి గొడవలకు దిగుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మత్తు పదార్థాల వినియోగం పెరగడంతో అసాంఘిక కార్యకలాపాలు కూడా పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో బెల్ట్‌షాపుల నిర్వహణపై కూడా ప్రజల్లో తీవ్ర విమర్శలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయా అనే అంశంపై అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.


పీవీ కాలనీ, బాంబే సెంటర్, మణుగూరు స్టోర్‌గ్రౌండ్స్, రాజపేట ప్రాంతాల్లో యువకుల గుంపుల సంచారంపై ప్రత్యేక నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రివేళల్లో అనుమానాస్పదంగా గుమిగూడే యువతపై పోలీసులు నిఘా పెంచాలని ప్రజలు అంటున్నారు. గంజాయి ఎక్కడి నుంచి వస్తోంది, ఎవరికి సరఫరా అవుతోంది, దీని వెనుక ఉన్న వ్యక్తులు ఎవరనే అంశాలపై లోతైన దర్యాప్తు జరగాలని డిమాండ్ చేస్తున్నారు. మత్తు పదార్థాలకు బానిసవుతున్న యువతను గుర్తించి కౌన్సెలింగ్ అందించడంతో పాటు వారిని క్రీడలు, విద్య, ఉపాధి వైపు మళ్లించాల్సిన అవసరం ఉంది. మత్తులో జరిగే ఘర్షణలు చివరకు తీవ్రమైన నేరాలకు దారితీసే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. "మా ముందు ఎవరు నిలబడరు" అనే ధోరణి కొందరు యువకుల్లో పెరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాత కక్షలతో యువకులు పరస్పరం దాడులకు పాల్పడకుండా ముందస్తు నిఘా అవసరమని స్థానికులు కోరుతున్నారు. బెల్ట్‌షాపులపై తనిఖీలు పెంచడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా అక్రమ మద్యం విక్రయాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. కొందరు అధికారులు మద్యం వ్యాపారుల నుంచి మామూళ్లు తీసుకుంటున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నప్పటికీ వాటికి అధికారిక ధ్రువీకరణ అవసరం ఉంది. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు, ఎక్సైజ్ శాఖ సమన్వయంతో పనిచేస్తే అక్రమ దందాలను అరికట్టే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో గంజాయి సరఫరాపై ప్రత్యేక నిఘా పెట్టాలని కోరుతున్నారు. గంజాయి సరఫరా గొలుసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మణుగూరు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలను ప్రారంభ దశలోనే అడ్డుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో కఠిన చర్యలు చేపట్టి గంజాయి, అక్రమ మద్యం దందాలకు అడ్డుకట్ట వేయాలని, యువత భవిష్యత్తును కాపాడటంతో పాటు మణుగూరు ప్రశాంత వాతావరణాన్ని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

# రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో హుండీ చోరీ

- దర్జాగా హుండీ ని మాయం చేసిన దొంగలు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఆదిభట్ల పోలీసులు

**మహేశ్వరం, ఆగస్టు 26,( అనంత జనశక్తి )**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలోని ప్రసిద్ధ చెందిన సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి అమ్మవారి గర్భాలయంలో ఉన్న హుండీని ఎత్తుకెళ్లాడు. స్థానికులు, ఆలయ వర్గాల కథనం ప్రకారం.. దొంగ బైక్ పై ఆలయానికి వచ్చి, ఎవరూ లేని సమయం చూసి దర్జాగా హుండీని ఎత్తుకెళ్లాడు. ఉదయం ఆలయానికి వచ్చిన పూజారికి హుండీ కనిపించకపోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది.సమాచారం అందుకున్న ఆలయ కమిటీ సభ్యులు ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆలయంలోని సీసీ కెమెరాల ఫుటేజీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఆలయంలో భద్రత కరువైందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చరిత్ర కలిగిన అమ్మవారి దొంగతనం జరగడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఇకనుంచి ఆలయానికి గట్టి భద్రత ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీని పోలీసులను భక్తులు కోరుతున్నారు.

# రావిరాల ప్రభుత్వ పాఠశాలలో అరాచకం



- ప్రభుత్వ డిజిటల్ మానిటర్ ధ్వంసం!
- గుడిలాంటి బడిలో ధ్వంసం చేయడమేంటి

**మహేశ్వరం, ఆగస్టు 26,( అనంత జనశక్తి)**

రావిరాల గ్రామంలోని జడ్.పి.హెచ్.ఎస్ ఉన్నత పాఠశాలలో గుర్తుతెలియని దుండగులు బీభత్సం సృష్టించారు. ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన డిజిటల్ మానిటర్ ను ఆకతాయిలు తాళ్లతో కొట్టి పూర్తిగా ధ్వంసం చేశారు.

అసలేం జరిగింది?

బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. రాత్రి వేళ స్కూల్ ఆవరణలోకి చొరబడిన ఆకతాయిలు మద్యం సేవించి, అక్కడ ఉన్న డిజిటల్ బోర్డుపై దాడి చేశారు. గురువారం ఉదయం పాఠశాల తెరిచేసరికి మానిటర్ పగిలిపోయి, ముక్కలు ముక్కలుగా కనిపించింది. దీంతో షాక్ కు గురైన ఉపాధ్యాయులు వెంటనే మహేశ్వరం పోలీసులకు సమాచారం ఇచ్చి ఫిర్యాదు చేశారు.

సెక్యూరిటీ లేకపోవడమే ప్రధాన కారణం!

పాఠశాలలో రాత్రి కాపలాదారు లేకపోవడమే ఈ దాడులకు కారణమని ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రతిరోజూ రాత్రి కాగానే కొందరు ఆకతాయిలు స్కూల్ గ్రౌండ్ లోకి వచ్చి మద్యం తాగుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, పాఠశాల ఆస్తిని ధ్వంసం చేస్తున్నారని గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామస్థుల డిమాండ్:

1. ప్రభుత్వ పాఠశాలకు వెంటనే శాశ్వత సెక్యూరిటీ గార్డును నియమించాలి.
2. రాత్రివేళల్లో పోలీస్ పెట్రోలింగ్ ను ముమ్మరం చేయాలి.
3. పాఠశాల ఆస్తి ధ్వంసం చేసిన దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలి.



ప్రభుత్వం పిల్లల భవిష్యత్తు కోసం అందించిన విలువైన డిజిటల్ పరికరాలను ఇలా నాశనం చేయడం దారుణమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సహోదర భావానికి ప్రతీక రాఖీ పౌర్ణమి

- ప్రతి ఒక్కరి జీవితంలో రాఖీ పౌర్ణమి సుఖసంతోషాలు నింపాలి
- రాష్ట్ర ప్రజలకు తెలంగాణ మహిళా అధ్యక్షురాలు కర్ణ కీర్తి సమీరా రెడ్డి

**నాగార్జునసాగర్,ఆగస్టు 27 అనంత జనశక్తి న్యూస్**



అన్నాచెల్లెళ్ల అప్యాయతకు అనురాగానికి ప్రతీక అయిన అత్యంత పవిత్రమైన రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల ప్రజలకు హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కర్ణ కీర్తి సమీరా రెడ్డి ఘనంగా రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్షా బంధన్ పండుగ కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, సమాజంలో సహోదరభావాన్ని, గౌరవాన్ని పెంపొందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి మహిళకు రక్షణ కల్పించడం,వారి హక్కులను పరిరక్షించడమే ప్రధాన ధ్యేయంగా తమ సంస్థ నిరంతరం పనిచేస్తోందని తెలిపారు,ప్రతి ఒక్కరి జీవితంలో ఈ రాఖీ పౌర్ణమి పండుగ సుఖసంతోషాలను,ఐక్యతను నింపాలని ఆమె ఆకాంక్షించారు,అన్నాచెల్లెళ్ల మధ్య బంధం మరింత బలపడాలని, సమాజంలో శాంతిభద్రతలు వర్ధిల్లాలని ఈ సందర్భంగా ఆమె అన్నారు.

# జనగణనకు గెజిట్ నోటిఫికేషన్

**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**



తెలంగాణలో సెన్సస్ 2027కు సంబంధించి ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. జనగణనకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను మరోసారి ప్రచురించాలని ఆదేశించింది. ఈ మేరకు ఆగస్టు 29న తెలంగాణ గెజిట్‌లో నోటిఫికేషన్ ప్రచురించనున్నారు. సెన్సస్ 2027లో భాగంగా ప్రజలకు సంబంధించిన మొత్తం 40 రకాల వివరాల సేకరణకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

వ్యక్తిగత వివరాల నమోదు

జనగణనలో భాగంగా ప్రతి వ్యక్తికి సంబంధించిన ప్రాథమిక వివరాలను సేకరించనున్నారు. ఇందులో పేరు, వయస్సు, లింగం, వైవాహిక స్థితి వంటి వివరాలు ఉంటాయి. అలాగే కులం, మతం, ఎస్సీ, ఎస్టీ తదితర వివరాలను కూడా నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. విద్యార్హతలు, ఉద్యోగం, వృత్తి తదితర వివరాలను కూడా జనగణనలో నమోదు చేయనున్నారు. ఒక వ్యక్తి ఏ రంగంలో పనిచేస్తున్నారు? వారి వృత్తి ఏమిటి? వంటి అంశాలను కూడా సేకరించనున్నారు.

వలసల వివరాలపై ప్రత్యేక దృష్టి

ప్రజల వలసలకు సంబంధించిన సమాచారాన్ని కూడా Census 2027లో నమోదు చేయనున్నారు. వ్యక్తి పుట్టిన ప్రదేశం, ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారు, గతంలో ఎక్కడ నివసించారు వంటి వివరాలను సేకరించనున్నారు. బ్యాంక్ ఖాతాలు, మొబైల్ నంబర్ వంటి వివరాల సేకరణకు కూడా అవకాశం కల్పించారు. అదేవిధంగా ఆధార్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్ వంటి గుర్తింపు పత్రాల వివరాలను నమోదు చేసే అవకాశం ఉంటుందని గెజిట్‌లో పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉందా? లేదా? అనే వివరాలను కూడా సేకరించాలని గెజిట్‌లో పేర్కొన్నారు.

పేరు, వయస్సు, లింగం, వైవాహిక స్థితి వంటి ప్రాథమిక వివరాలతో పాటు కులం, ఉపకులం, మతం, ఎస్సీ, ఎస్టీ వంటి సామాజిక వివరాలను కూడా ఈ జనగణన ప్రక్రియలో ఎన్యూమరేటర్లు సేకరించనున్నారు. విద్యార్హతలు, ఉద్యోగం, వృత్తి, వ్యక్తి ఏ రంగంలో పనిచేస్తున్నారనే సమాచారాన్ని కూడా నమోదు చేయనున్నారు.

జనగణనలో ప్రజల వలసలకు సంబంధించిన సమాచారానికి కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఒక వ్యక్తి పుట్టిన ప్రాంతం.. ఆ వ్యక్తి ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారు.. గతంలో ఎక్కడ నివసించారు వంటి వివరాలను కూడా సేకరించనున్నారు. దీంతో వివిధ ప్రాంతాల మధ్య జనాభా వలసలపై మరింత స్పష్టమైన సమాచారం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

అదే సమయంలో బ్యాంక్ అకౌంట్, మొబైల్ నంబర్, ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్ వంటి గుర్తింపు పత్రాలకు సంబంధించిన వివరాలను నమోదు చేసే అవకాశం ఉందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. డ్రైవింగ్ లైసెన్స్ ఉందా లేదా అనే వివరాలను కూడా సేకరించనున్నారు. ఇప్పటివరకు ఉన్న సమాచారం ప్రకారం.. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జనగణన ప్రక్రియ కొనసాగనుంది. అంతకుముందు ఆగస్ట్ 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ప్రజలకు స్వయంగా వివరాలను నమోదు చేసుకునే సెల్ఫ్ ఎన్యూమరేషన్ సదుపాయం కల్పించారు. కుల గణనకు కూడా ఈసారి ప్రత్యేక ప్రాధాన్యం ఉండటంతో జనగణన 2027పై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. తెలంగాణలో రాష్ట్ర గెజిట్ నోటిఫికేషన్ పునఃప్రచురణతో జనగణనకు సంబంధించిన పరిపాలనా ప్రక్రియ మరింత వేగం పుంజుకోనుంది.

# ఏడీ జయరాజు నివాసాల్లో రూ.100 కోట్ల ఆస్తులు



**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూగర్భగనుల శాఖ ఏడీ జయరాజు నివాసాల్లో ఏసీబీ అధికారులు చేపట్టిన సోదాల్లో సుమారు రూ.100 కోట్ల విలువ చేసే ఆస్తులు గుర్తించారు. దీంతో ఆయనను అరెస్టు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో భూపాలపల్లి, హైదరాబాద్, సూర్యాపేట, తాండూరు సహా 12 ప్రాంతాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఈరోజు సోదాలు చేపట్టారు. ఈ క్రమంలో జయరాజుకు హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో రెండంతస్తుల భవనం, కేపీహెచ్‌బీలో ఫ్లాట్, కీసర, సూర్యాపేట, తూప్రాన్, తుంగతుర్తిలో ప్లాట్లు, సూర్యాపేటలో 3.21 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించారు.

జయరాజ్ నివాసాల్లో రూ.10 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇళ్లల్లో భారీగా గృహోపకరణాలు, రూ.71 లక్షల బ్యాంకు నిల్వలు ఉన్నట్లు తేలింది. డ్రైవర్‌కు పలు దఫాలుగా రూ.24 లక్షలు బదిలీ చేసినట్లు గుర్తించారు. ఇసుక రవాణా మామూళ్లను ఏడీ జయరాజ్ తన ఖాతాకు బదిలీ చేసినట్లు డ్రైవర్ వెల్లడించాడు. ఆ డబ్బును జయరాజు కుమార్తెకు బదిలీ చేసినట్లు తెలిపాడు. ఇటీవల ఉత్తమ అధికారిగా జయరాజు అవార్డు అందుకోవడం గమనార్హం.



# 'మహిళ కన్నీరు నేలపై పడితే సునామీనే'

- కొండా సురేఖ వివాదంపై..
- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కొండా సురేఖ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతున్న వేళ కాంగ్రెస్ నేత, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. మహిళలను తాను ఎంతో గౌరవిస్తానని పేర్కొన్న అనిరుధ్ రెడ్డి.. వారి గురించి బహిరంగంగా ప్రెస్‌మీట్లు పెట్టి మాట్లాడే ఉద్దేశం తనకు లేదని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా మహిళల పట్ల తన వైఖరిని వివరిస్తూ అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. మహిళలు తనను తిట్టినా వాటిని ఆశీర్వాదాలుగానే భావిస్తానని పేర్కొన్నారు. తన తల్లి తనను మందలించినా ఎదురు మాట్లాడకుండా అక్కడి నుంచి వెళ్లిపోతానని చెప్పారు.


మహిళలు కన్నీళ్లు పెట్టుకుంటే ఆ భావోద్వేగాన్ని తేలిగ్గా తీసుకోకూడదని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఒక మహిళ కన్నీరు ఒక్క చుక్క నేలపై పడినా అది సునామీగా మారుతుంది.. ఆ సునామీలో మనమే కొట్టుకుపోతాం అని పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖకు సంబంధించిన వివాదంపై ఎవరూ బహిరంగంగా మాట్లాడవద్దని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే సూచించారని అనిరుధ్ రెడ్డి తేల్చి చెప్పారు. ఈ వ్యవహారం ప్రస్తుతం కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ పరిశీలనలో ఉందని చెప్పారు. ఏఐసీసీ, పీసీసీ, ముఖ్యమంత్రి స్థాయిలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి తాము కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. ఎవరు తప్పు చేశారనేది దేవుడికి తెలుసని చెప్పిన అనిరుధ్ రెడ్డి.. క్రమశిక్షణ కమిటీ నివేదిక ఎలా ఉన్నా దాన్ని గౌరవిస్తామని అనిరుధ్ రెడ్డి తేల్చి చెప్పారు. పార్టీ అంతర్గత వ్యవహారంపై తాను మరింతగా స్పందించను అనే సంకేతాలు ఇచ్చారు.

ఇదే సమయంలో తన నియోజకవర్గ సమస్యలపై మాత్రం వెనక్కి తగ్గేది లేదని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. జడ్చర్లలో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు నిలిచిపోయాయని.. బిల్లుల చెల్లింపుల కోసం ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. తన నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడితే ఎవరినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అవసరమైతే మంత్రులను కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరుతానని.. నిధులు రాకపోతే దీక్షకు కూడా కూర్చుంటానని వ్యాఖ్యానించారు.

ప్రజల సమస్యల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో తప్పేమీ లేదని ఈ సందర్భంగా అనిరుధ్ రెడ్డి అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రజలకు ప్రశ్నించే హక్కును కల్పించిందని.. తమ నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. మొత్తంగా కొండా సురేఖ వ్యవహారంపై సంయమనం పాటిస్తూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పిన అనిరుధ్ రెడ్డి.. మరోవైపు జడ్చర్ల అభివృద్ధి విషయంలో మాత్రం ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో వెనుకడుగు వేయబోనని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఆ వందరూపాయలే ఈ స్థాయిలో ఉంచాయి: జీవీ నారాయణ గతంలో పంచుకున్న విషయాలు





100కు పైగా సినిమాలతో ప్రేక్షకులను మెప్పించిన జీవీ నారాయణ రావు తుదిశ్వాస విడిచారు. గత కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన.. బుధవారం సాయంత్రం కన్నుమూశారు. తొలి సినిమాతోనే నంది అవార్డు అందుకున్న ఘనత నారాయణది. సినీకెరీర్, ఇండస్ట్రీలో తన స్నేహితులైన రజనీకాంత్, చిరంజీవి గురించి ఆయన గతంలో కొన్ని ఇంటర్వ్యూల్లో పంచుకున్నారు. జీవితంలో ఎదురైన ఒడుదొడుకుల నుంచి పాఠాలు నేర్చుకున్నట్లు చెప్పారు.

**డబ్బు మీద ఎప్పుడూ ఆశ లేదు..**

"రూ.5000 సంపాదిస్తే చాలు అనుకుని సినిమాల్లోకి వచ్చాను. మేం నాటకాలు వేసేటప్పుడు ఆ మొత్తం చాలా పెద్దది. నా మొదటి సినిమా 'అంతులేని కథ'కు గానూ నాకు, రజనీకాంత్‌కు కలిపి రూ.2000 పారితోషికం ఇచ్చారు. రూ.100 అడ్వాన్స్‌గా ఇచ్చారు. అదే అప్పట్లో గొప్ప విషయం. ఆ చెక్ తీసుకెళ్లి గుడిలో పూజ చేయించుకున్నాం. ఆ వందరూపాయలే మమ్మల్ని ఈ స్థాయిలో ఉంచాయి. అప్పట్లో నటి సుజాతతో 'ఇంటికో రుద్రమ్మ' అనే సినిమా తీశా. అది సరిగ్గా ఆడలేదు. అదే సినిమా శారదతో తీసి ఉంటే సూపర్ హిట్ అయ్యేది. అయినా ఆ విషయంలో బాధపడలేదు. ఆపై హీరోయిన్ ఎంపికలో జాగ్రత్త పడ్డాను. ఎన్నో సినిమాలు నిర్మించినా డబ్బు మీద ఎప్పుడూ ఆశ పడలేదు. ప్రేక్షకుల ప్రేమను సంపాదించుకున్నాను"

**రజనీకాంత్ - చిరంజీవి గురించి..**

"నేను, రజనీకాంత్ మంచి స్నేహితులం. అతడు చాలా రిస్క్ చేసి ఇండస్ట్రీకి వచ్చాడు. బస్ కండెక్టర్‌గా ఉద్యోగం చేస్తూ.. దాన్ని మధ్యలో వదిలేసి రెండేళ్లు ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్నాడు. ఆ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. మా ఇంట్లో భోజనం చేసి వెళ్తూ వెళ్తూ ఖర్చుల కోసం రెండు రూపాయలు అడిగి తీసుకెళ్లేవాడు. చిరంజీవి హీరో కావడానికి వాళ్ల నాన్న చాలా ప్రోత్సహించారు. చిరుకు సాయం చేసే గుణం ఎక్కువ. సినిమా 100 రోజుల కార్యక్రమాల్లో ఎంతోమంది రైతులకు సాయం చేశాడు. ఆయన చేసిన ఎన్నో మంచి పనులు ప్రపంచానికి తెలియవు".

**జీవితంలో ఎన్నడూ పశ్చాత్తపపడలేదు..**

"నేను మంచి పాత్రలు చేశా. మొదటి సినిమా నుంచి మొదలు పెడితే ఎన్నో అవార్డులు వచ్చాయి. జీవితంలో ఏ విషయంలోనూ నాకు పశ్చాత్తాపం లేదు. ఇది సాధించలేకపోయాననే బాధ లేదు. దేవుడు ఇచ్చిన దాంట్లో తృప్తిగా బతికాను. చేతనైనంత సాయం చేశాను" అని గతంలో నారాయణ పంచుకున్నారు.



# సంస్కృతి పట్ల గౌరవాన్ని దుస్తులతో కొలుస్తారా!



పండగ స్ఫూర్తి అనేది భావోద్వేగాలు, సంప్రదాయాలలో ఉంటుందని.. అంతేగానీ ఒక మహిళ వస్త్రధారణలో ఉండదని అంటోంది బాలీవుడ్ నటి కృతి సనన్. ఇటీవల ఆమె చేసిన రక్షాబంధన్ వాణిజ్య ప్రకటనపై సామాజిక మాధ్యమాల వేదికగా పలు వు రు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అందులో ఆమె రాఖీ పండగకు ధరించిన దుస్తులపైనా, పెంపుడు జంతువుకు రాఖీ కట్టడం గురించి నెటిజన్ల నుంచి విమర్శలొచ్చాయి. ఈ నేపథ్యంలో వాటికి గట్టిగా బదులిస్తూ కృతి తాజాగా ఇన్‌స్టా స్టోరీలో ఓ పోస్ట్ పెట్టారు. "మహిళలు ఏమి ధరించాలో చెప్పడం మనం ఎప్పుడు ఆపుతాం? ఏళ్ల తరబడి సంప్రదాయ ఫ్యాషన్ ఎంతో అభివృద్ధి చెందుతుంది. కానీ, ఇప్పటికీ ఒక మహిళ తన సంస్కృతి పట్ల చూపించే గౌరవాన్ని కేవలం ఆమె దుస్తులతోనే కొలుస్తున్నారు. సంస్కృతి, సంప్రదాయాలు ఆమె హృదయంలో ఉంటాయి. ఆమె నెక్‌లైన్‌లో కాదు! పండగల స్ఫూర్తి మనం ధరించే దుస్తులలో లేదు. సంప్రదాయాల పట్ల మనం కలిగి ఉండే భావోద్వేగాలు, వాటి అర్థంలో ఉంది. రాఖీ ఒక రక్షణ బంధం. నేనూ, నా సోదరి ఒకరికొకరం రాఖీ కట్టుకుంటాం. సోదరులు ఎలాగైతే ఒకరినొకరు కాపాడుకుంటారో మేమూ అదే స్థాయిలో మమ్మల్ని కాపాడుకోగలం. ఈ వాగ్దానం మాకు, మా కుక్క లకు కూడా వర్తిస్తుంది. ఏదేమైనా అవి మా కుటుంబమే కదా!" అని అందులో రాసుకొచ్చారు.

# ఆ అడవికి కాపలా ఓ అజ్ఞాత శక్తి

`సిద్ధార్థ్ మల్హోత్రా, తమన్నా ప్రధాన పాత్రల్లోరూపొందుతున్న చిత్రం 'ది వీవాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్'. దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబరు 25న రానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర టీజర్‌ను ఇటీవల సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "ఆ అడవికి ఒక అజ్ఞాత శక్తి కాపలాగా ఉండేది. నేను చూసే ఈ వింత విషయాలన్నిటికి అర్థం ఏమిటి? మీకు ఈ అడవితో ఏదో సంబంధం ఉంది. మనకు ఆమె రక్షకురాలు. ఆమె దివ్య వాహనమే పులి" లాంటి సంభాషణలు ఆసక్తిగా సాగాయి. ఎవరూ అడుగు పెట్టడానికి కూడా సాహసించని ఒక ప్రదేశంలోకి ప్రవేశించి, అడవి జానపద సంస్కృతి, దాని అతీంద్రియ సారం గురించి ఒక పూర్తి రహస్యాన్ని బయటపెట్టడమే ఈ చిత్ర కథాంశమని టీజర్ స్పష్టం చేస్తుంది.




# కివీస్ vs భారత్.. హాట్‌కేకుల్లా అమ్ముడైన ప్రిసేల్ టికెట్లు




టీమ్‌ఇండియా ఎక్కడ ఆడితే అక్కడ కాసుల వర్షం అనేందుకు ఇదొక ఉదాహరణ. మరో రెండు నెలల్లో భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది. మూడు ఫార్మాట్లలోనూ సిరీస్‌లు ఆడనుంది. ఇరు జట్లూ ఐదు వన్డేలు, ఐదు టీ20లు, రెండు టెస్టుల్లో తలపడనున్నాయి. మొత్తం 12 మ్యాచులు ఐదు వేదికల్లో జరుగుతాయి. ఈ క్రమంలో కివీస్ జట్టు ప్రిసేల్ ద్వారా అక్కడి అభిమానుల కోసం టికెట్లను అందుబాటులోకి తెచ్చింది. అయితే, కేవలం 48 గంటల్లోనే 26వేల టికెట్లు అమ్ముడవ్వడం విశేషం.

అక్టోబర్‌లో టీ20 సిరీస్‌తో న్యూజిలాండ్ పర్యటన మొదలవుతుంది. క్రిస్ట్‌చర్చ్ వేదికగా తొలి రెండు టీ20లు జరుగుతాయి. ఈ మైదానం కెపాసిటీ 9వేలు మాత్రమే. టీ20లతోపాటు ఓ టెస్టు మ్యాచ్ కూడా జరగనుంది. మిగతా మూడు మ్యాచులు వెల్లింగ్టన్, ఆక్లాండ్, హామిల్టన్ మైదానాల్లో జరుగుతాయి.

పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్‌ల కోసమే కాకుండా టెస్టులను చూసేందుకూ డిమాండ్ ఉందని కివీస్ చీఫ్ మార్కెటింగ్, కమర్షియల్ ఆఫీసర్ గ్లెన్ క్రిచ్‌లే తెలిపారు.

"తొలి రెండు రోజుల్లోనే రికార్డు స్థాయిలో సేల్స్ నమోదయ్యాయి. భారత్ వంటి పెద్ద జట్టుతో ఆడే మ్యాచులను వీక్షించే అవకాశం కివీస్ అభిమానులకు చాలా అరుదుగానే వస్తుంటుంది. గత సీజన్ మాదిరిగానే ఈసారి కూడా టికెట్ల ధరలను అందుబాటులోనే ఉంచాం. నేషన్ యాక్సెస్ కోడ్ వినియోగించుకో వడం ద్వారా ఇక్కడి అభిమానులకు 30 డాలర్ల కంటే తక్కువకే టికెట్ రానుంది. ముందస్తు సేల్‌లో ఫ్యాన్స్ నుంచి మంచి ఆదరణ లభించడం ఆనందంగా ఉంది. సెప్టెంబర్ 7 నుంచి సాధారణ టికెట్లను అందుబాటులోకి తీసుకొస్తాం" అని గ్లెన్ వెల్లడించారు.

# మూడు వారాలే ఉంది..

## ఇదేం పిచ్.. ఇలాగేనా వసతి?: బీసీసీఐ, పీసీబీ అసంతృప్తి



జపాన్ వేదికగా మరో మూడు వారాల్లోనే ఆసియా గేమ్స్ ప్రారంభమవుతాయి. అందులో క్రికెట్ కూడా భాగమే. కానీ, అక్కడి ఏర్పాట్లపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. కరోగి స్పోర్ట్స్ పార్క్ వేదికగా మ్యాచులను నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. అయితే, పిచ్ నాణ్యత అత్యంత నాసిరకంగా ఉందని.. అలాగే వసతికి సంబంధించి కూడా సరైన ఏర్పాట్లు లేవని బీసీసీఐ, పీసీబీ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భారత్, పాక్, బంగ్లా, శ్రీలంక, అఫ్గాన్‌తో కూడిన ఆసియా క్రికెట్ కౌన్సిల్ నుంచి ప్రతినిధుల బృందం జపాన్‌లో పర్యటించనుంది. ఐసీసీ నిబంధనల ప్రకారం మైదానం కనీసం 2వేల మంది అభిమానులు చూసేలా ఉండాలి. కానీ, జపాన్ ఎంపిక చేసిన స్టేడియం అందుకు తగ్గట్టుగా లేదు.

"ఆసియా గేమ్స్‌లో క్రికెట్ మ్యాచులను నిర్వహించాలని అనుకుంటోన్న మైదానం స్థాయి చాలా చిన్నది. పిచ్ నాణ్యతపైనా సందేహాలు ఉన్నాయి. గత మేలో అక్కడ ఓ టోర్నమెంట్ మినహా.. ఎక్కువగా మ్యాచులు జరగలేదు. కనీసం ఇక్కడ సరైన డ్రెస్సింగ్ రూమ్‌లు కూడా లేవు" అని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఇదే విషయంపై భారత ఒలింపిక్ అసోసియేషన్, ఆసియా గేమ్స్ ఆర్గనైజింగ్ కమిటీతో ఇప్పటికే బీసీసీఐ చర్చలు జరిపినట్లు సమాచారం.

**ఆటగాళ్ల వసతిపైనా..**

మ్యాచ్‌లు జరగనున్న మైదానానికి ఆటగాళ్లు ఉండే హోటళ్లకు 20 కి.మీ దూరం ఉన్నట్లు తెలుస్తోంది. ఫుట్‌బాల్, సాఫ్ట్‌బాల్ ప్లేయర్లతో కలిపి వారికి వసతి కల్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఆ గదులు కూడా చాలా చిన్నవిగా ఉన్నాయని.. ఇద్దరు ప్లేయర్లు తమ కిట్‌లు, బ్యాగ్‌లను అందులో ఉంచుకొనేందుకూ సరిపోదనేది అధికారుల సందేహం. పురుషుల, మహిళా జట్ల నుంచి స్టార్ ప్లేయర్లు ఆడే ఈ టోర్నీలో సరైన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.

# సహచరులుగా అప్పుడు తండ్రులు.. ఇప్పుడు కుమారులు




భారత క్రికెట్‌లోకి వారసులు రావడం కొత్తేమీ కాదు. అయితే, ఇద్దరు దిగ్గజ క్రికెటర్ల కుమారులు ఒకేసారి తమ అండర్ -19 కెరీర్‌ను ప్రారంభించడం గమనార్హం. మొన్నటి తరం వరకూ ఆ ఇద్దరు సీనియర్ల క్రికెట్‌ను చూసిన అభిమానులకు.. ఇప్పుడు వారి కుమారుల ఆటను వీక్షించే అవకాశం రాబోతోంది. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ఎంపిక చేసిన అండర్-19 జట్టులో వీరేంద్ర సెహ్వాగ్, రాహుల్ ద్రవిడ్ కుమారులకు చోటు దక్కింది. ఈ మేరకు బీసీసీఐ డొమెస్టిక్ సెలక్షన్ కమిటీ.. ఆస్ట్రేలియాతో వన్డే, మల్టీడే మ్యాచుల కోసం స్క్వాడ్‌ను ప్రకటించింది. ఇందులో ఆర్యవీర్ సెహ్వాగ్, అన్వయ్ ద్రవిడ్‌కు అవకాశం లభించింది.

డ్యాషింగ్ ఓపెనర్ అయిన వీరేంద్ర సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్. అతడు కూడా దూకుడైన బ్యాటరే. ఇటీవల ఓ మ్యాచ్‌లో అచ్చం తన తండ్రిలానే కొట్టిన షాట్ల వీడియో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఇక మాజీ కెప్టెన్, మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ కుమారుడు అన్వయ్.. వికెట్ కీపర్ కమ్ బ్యాటర్. రాజ్‌కోట్ వేదికగా ఆసీస్ u19 జట్టుతో భారత్ యువ టీమ్ తలపడనుంది. వన్డే జట్టుకు రాయ్‌చందాని సారథిగా వ్యవహరిస్తాడు. యశ్‌బర్దాన్ చౌహాన్ అతడికి డిప్యూటీగా ఎంపికయ్యాడు. ఇక మల్టీడే మ్యాచులకు చౌహాన్ కెప్టెన్ కాగా.. రాయ్‌చందాని వైస్ కెప్టెన్‌గా ఉంటారు.

**స్క్వాడ్‌లు**

వన్డేలకు: లక్ష్య రాయ్‌చందాని (కెప్టెన్), యశ్‌బర్దాని చౌహాన్ (వైస్ కెప్టెన్), రజత్ బాగెల్ (వికెట్ కీపర్), ఆర్యవీర్ సెహ్వాగ్, వీకే వినీత్, కుషాంగ్రా ఓఝా, అర్జున్ రాజ్‌పుత్, మనల్ చౌహాన్, అన్వయ్ ద్రవిడ్ (వికెట్ కీపర్), యశ్‌వీర్, రోహిత్ యాదవ్, షావిన్ వినోద్, మోహిత్ ఉల్వా, చిగురుపాటి వెంకట, కావ్యా పటేల్

మల్టీడే మ్యాచులకు: యశ్‌బర్దాని చౌహాన్ (కెప్టెన్), లక్ష్య రాయ్‌చందాని (వైస్ కెప్టెన్), సాగర్ విర్క్, కుషాంగ్రా ఓఝా, మనల్ చౌహాన్, కుష్ పటేల్, మానవ్ కృష్ణ (వికెట్ కీపర్), అభిప్రాయ్ బిశ్వాస్ (వికెట్ కీపర్), రోహిత్ యాదవ్, ఇషాన్ ఓమ్, అయాన్ అక్రమ్, ప్రణవ్ రాఘవేంద్ర, ప్రియాన్ష సింగ్, మోహిత్ ఉల్వా, ఆర్యన్ యాదవ్

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945